






పెద్దాయనకు దక్కిన గౌరవం: ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇలా ప్రమాణ స్వీకారం చేయించారు. 174 మంది శాసనసభ్యులతో గోరంట్ల ప్రమాణస్వీకారం చేయిస్తారు..



అనే నేను..

నేడు కూటమి ప్రభుత్వ తొలి అసెంబ్లీ

- ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల
- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- మూడు జిల్లాల్లో 21 మంది
- రంపచోడవరం నుంచి ఒకరు
- వీరిలో 12 మంది కొత్తవారే
- ముగ్గురికి మంత్రి పదవులు
- డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్
- 10 మందికి మళ్లీ ఛాన్స్
- అందరూ కూటమి సభ్యులే

(రాజమహేంద్రవరం/కాకినాడ/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడిన తర్వాత తొలిసారిగా అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీనికోసం ముందుగా ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇక 21, 22వ తేదీల్లో జరిగే రెండు రోజుల సమావేశాలను గోరంట్ల బుచ్చయ్యచౌదరి నిర్వహిస్తారు. శుక్ర, శని వారాల్లో మొత్తం 174 మంది ఎమ్మెల్యేలతోనూ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేత కూడా ఆయన ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 22న రాష్ట్ర స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత ఆయన బాధ్యత తీరిపోతుంది. ఏడు సార్లు అసెంబ్లీకి ఎన్నికైన గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గౌరవంగా ఈ అవకాశం దక్కింది. రాజమండ్రి సిటీ నుంచి నాలుగు సార్లు, రాజమండ్రి రూరల్ నుంచి మూడు సార్లు గోరంట్ల శాసనసభ్యుడిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గతంలో మంత్రిగా కూడా పనిచేశారు.ఏ ప్రాధాన్యతా క్రమంలో అసెంబ్లీలో ప్రమాణ స్వీకారాలు ఉంటాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ముగ్గురు మంత్రులూ బాధ్యతల్లోకి..

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ శాఖల మంత్రిగా ఇప్పటికే బాధ్యతలు స్వీకరించగా, నిడదవోలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దుర్గేష్ టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగాను, రామచంద్రపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్ కార్మిక శాఖా మంత్రిగాను గురువారం బాధ్యతలు స్వీకరించారు.అయితే వీరు ముగ్గురితో కూడా శాసనసభలో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

తూర్పుగోదావరి నుంచి...

నిడదవోలు జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కిన సంగతి తెలిసిందే. ఆయన గురువారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవర నగర నివాసి అయిన మంత్రి దుర్గేష్ తాత పోతుల వీరభద్రరావు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగానూ, మున్సిపల్ చైర్మన్‌గా పలుదఫాలుగా పనిచేశారు. దుర్గేష్ అసెంబ్లీలోకి తొలిసారి ప్రవేశిస్తున్నారు. ఎమ్మెల్సీగా గతంలో శాసనమండలిలో ఆరేళ్లపాటు ఉన్నారు. ఆయన రాజమహేంద్రవరం సిటీకి చెందిన నాయకుడైనప్పటికీ నిడదవోలు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి పదవి కూడా దక్కించుకోవడంతో ఎక్కువ దృష్టి ఆయనకు నిడదవోలు మీదే ఉంటుంది. త్వరలో అక్కడ సొంతిల్లు కూడా ఏర్పాటుచేసుకోనున్నారు. ఇక కొవ్వూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ముప్పిడి వేంకటేశ్వరరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో ఆయన గోపాలపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచి అసెంబ్లీకి వెళ్లారు. ఇవాళ కొవ్వూరు నుంచి గెలిచారు. అనపర్తి నుంచి కూటమి తరపున బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా రెండో సారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లిన రామకృష్ణారెడ్డి ఈసారి పొత్తు వల్ల అనూహ్యంగా బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన ఈసారి బీజేపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలకుగాను నలుగురు తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. నిడదవోలు నుంచి కూటమి తరపున గెలిచిన రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2019లో వైసీపీ సునామీలో కూడా ఆయన సతీమణి ఆదిరెడ్డి భవానీ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన సంగతి తెలిసిందే. ఆయన తండ్రి అప్పారావు ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన తల్లి రాజమండ్రి కార్పొరేషన్ తొలి మేయర్. రాజానగరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన బత్తుల బలరామకృష్ణ తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. ఇక గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కూడా తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

కాకినాడ జిల్లా నుంచి..

ఎన్నికల అనంతరం అసెంబ్లీ శుక్రవారం కొలువుతీరనున్నది. కాకినాడ జిల్లా నుంచి నలుగురు శాసనసభ్యులు తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించి శాఖాపరంగా విజయవాడలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ జిల్లా నుంచి అమరావతికి తరలివెళ్లారు. జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా, ఇందులో పిఠాపురం నుంచి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసెంబ్లీకి ఎన్నికకావడం ఇదే తొలిసారి. 2014 ఎన్నికల ముందు జనసేన పార్టీ స్థాపించిన పవన్ 2019 ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించడమే కాకుండా తన పార్టీ తరపున పోటీ చేసిన 21 మంది శాసనసభ్యులుగా ఎన్నికకావడంతో విజయదరహాసంతో సభలో అడుగుపెట్టనున్నారు. అసెంబ్లీలో రెండో అతి పెద్ద పార్టీగా జనసేన ఉండనున్నది. ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ, తుని నుంచి యనమల దివ్య, కాకినాడ రూరల్ నుంచి పంతం నానాజీ తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. సత్యప్రభ భర్త రాజా గత ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. రాజా ఆకస్మిక మరణంతో రాజకీయాల్లోకి వచ్చిన సత్యప్రభ తాను పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే విజయం సాధించారు. అదే విధంగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుమార్తె అయిన దివ్య తొలి ఎన్నికల్లోనే గెలుపును సొంతం చేసుకున్నారు. పలుసార్లు ఎన్నికల్లో పోటీ చేసి విజయతీరాలకు చేరలేకపోయిన జనసేన నేత పంతం నానాజీ ఈ సారి మాత్రం జిల్లాలోనే రికార్డుస్థాయి మెజార్టీతో కాకినాడ రూరల్ నుంచి గెలుపొందారు. ఇప్పటికే పలుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసిన కాకినాడ, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు), జ్యోతుల నెహ్రూలు మరోమారు అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. పెద్దాపురం నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నిమ్మకాయల చినరాజప్ప అసెంబ్లీకి వెళ్లనున్నారు.

కోనసీమ జిల్లా నుంచి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వీరిలో వాసంశెట్టి సుభాష్ తొలిసారిగా ఎమ్మెల్యేకావడంతో పాటు అనూహ్యంగా మంత్రిగానూ బాధ్యతలు స్వీకరించారు. జనసేన నుంచి రాజోలులో పోటీచేసి గెలిచిన దేవ వరప్రసాద్ కూడా తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వరప్రసాద్ సీనియర్ ఐఏఎస్. అలాగే పి.గన్నవరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి సత్యనారాయణ తొలిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీ మెట్లు ఎక్కనున్నారు. సత్యనారాయణ కూడా పోలీసు శాఖలో అధికారిగా పనిచేశారు. ఇక మండపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా నాలుగోసారి శాసనసభ్యుడిగా అడుగుపెడుతున్నారు. కొత్తపేట నుంచి ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికైన బండారు సత్యానందరావు కూడా నాలుగో సారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. అమలాపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అయితాబత్తుల ఆనందరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా, ముమ్మిడివరం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన దాట్ల బుచ్చిబాబు మూడోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలకు నలుగురు సీనియర్లు, ముగ్గురు తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.

రంపచోడవరంలోనూ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి రంపచోడవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవి కూడా తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న ఈమె ఏకంగా అసెంబ్లీలోకి టీడీపీ ఎమ్మెల్యేగా అడుగుపెడుతుండడం విశేషం.

కొత్త ఎమ్మెల్యేలదే హవా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా చూసినా, కొత్తగా ఏర్పడిన మూడు జిల్లాల పరిధిలో చూసినా తొలిసారిగా ఎమ్మెల్యేలుగా అడుగుపెడుతున్న వారే అధికంగా ఉండడం విశేషం. మూడు జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా, వీరంతా మొదటిసారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నవారే. కాకినాడ జిల్లా నుంచి తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నుంచి ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీ లోకి అడుగు పెడుతుండగా, అటు రంపచోడవరం నుంచి ఎమ్మెల్యే తొలిసారిగానే అడుగుపెడతారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రామచంద్రపురం, పిగన్నవరం, రాజోలు నుంచి కొత్తవారే అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా,తూర్పుగోదావరి జిల్లా నుంచి రాజమండ్రి సిటీ, రాజానగరం,నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీ మెట్లు ఎక్కుతున్నారు. మూడు జిల్లాల్లో 21 నియోజకవర్గాలు, అటు రంపచోడవరం నియోజకవర్గం మొత్తం 22 మందిలో 12 మంది కొత్తవారే, పది మంది సీనియర్లు.






మంత్రి కందుల దుర్గేష్‌కు అభినందనలు తెలుపుతున్న శేషారావు

నా శాఖకు వన్నె తెస్తా : దుర్గేష్

నిడదవోలు,జూన్ 20 : మంత్రిగా నా శాఖకు వన్నె తెస్తానని రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.అమరావతిలో గురువారం సాయంత్రం 5.51 గంటలకు ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట కుమారుడు డాక్టర్ కందుల కృష్ణతేజ, డాక్టర్ సుస్మిత, అల్లుడు ఈలి సత్యేంద్ర, కుమార్తె ఈలి శ్రీరంగప్రియ ఉన్నారు.అనంతరం కందుల దుర్గేష్‌కు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శుభాకాంక్షలు తెలిపారు.నిడదవోలు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేష్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు.లండన్ నుంచి ఫోన్ చేసి డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి అభినందనలు తెలిపారు.సిటీకేబుల్ ఎండీ నీలం నాగేంద్ర ప్రసాద్, ఆనందం వెంకటేశ్వర్లు, జనసేన నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భోగవల్లి ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.


అసెంబ్లీలోని తన చాంబర్‌లో తల్లిదండ్రులు, భార్య పిల్లలతో మంత్రి వాసంశెట్టి సుభాష్

చాంబర్‌లో మంత్రిగా తొలిసంతకం పెడుతున్న సుభాష్

కార్మికుడిగా పని చేస్తా : సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 20 : కార్మికుల సంక్షేమానికి తాను కూడా ఒక కార్మికుడిగా పని చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా వాసంశెట్టి సుభాష్ చెప్పారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ చాంబర్‌లోకి ప్రవేశించారు. సతీమణి లక్ష్మీసునీత, కుమార్తెలు, తల్లిదండ్రులతో కలిసి పూజలు జరిపారు. ఉదయం 7.34 గంటలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం సుభాష్ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలు 13 తొలగించిందన్నారు. కార్మికుల సంక్షేమం టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వం వేతనాలు ఇచ్చే పోస్టులను కూడా భర్తీ చేయలేదన్నారు.జిల్లావ్యాప్తంగా టీడీపీ,జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సచివాలయానికి తరలివెళ్లారు.మంత్రి సుభాష్‌కు జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, పట్టణ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, టీడీపీ నాయకుడు మేడిశెట్టి శేషారావు, మాజీ ఎంపీటీసీ విత్తనాల వెంకటరమణ, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కడియాల రాఘవన్, నందూరి ఫణికుమార్, పితాని వీరభద్రరావు, పెంకె సాంబశివరావు, కంచుమర్తి బాబూరావు, నెం.1 బాబు శుభాకాంక్షలు తెలిపారు.



బొమ్మూరులోని కలెక్టరేట్ వెనుక ముస్తాబైన సైన్స్ మ్యూజియం

పవన్..పవర్

- బొమ్మూరు సైన్స్ మ్యూజియం త్వరలో ప్రారంభం
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో కదలిక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు సైన్స్‌మ్యూజియం ప్రారంభం కానుంది.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సైన్స్ అండ్ టెక్నాలజీ,పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారుల్లో కదలిక వచ్చింది. గత పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ చొరవతో రాజమహేంద్రవరానికి సైన్స్ మ్యూజియం మంజూరైంది. రూ.16.82 కోట్లు కేటాయించారు. మొదట స్థల సేకరణ జాప్యమైంది. ఆ తరువాత బొమ్మూరులోని మహిళా ప్రాంగణం పక్కన ప్రధాన రహదారిని ఆనుకుని ఐదెకరాల స్థలంలో కేంద్రం, రాష్ట్రం సమాన భాగస్వామ్యంతో దీనిని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీఓఎస్‌టీ) ఆధ్వర్యంలో కలకత్తాలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం(ఎన్‌సీఎస్ఎం) ఆధ్వర్యంలో ఇది జరిగింది. 2017లో మంజూరు కాగా 2018 ఫిబ్రవరి 18న శంకుస్థాపన చేశారు. 2019 జనవరిలో పనులు ఆరంభమయ్యాయి. బెంగళూరు కంపెనీ పనులు చేసింది. విద్యార్థులకు సైన్స్ పరంగా బాగా ఉపయోగపడే విధంగా విజ్ఞాన కేంద్రాన్ని తీర్చిదిద్దారు. భవనం, పార్కులు తీర్చిదిద్దారు. కానీ సైట్ ఫిల్లింగ్ చేయకుండా రోడ్డుకంటే పల్లం ప్రాంతంలో దీనిని నిర్మించడం విమర్శలకు దారి తీసింది. టీడీపీ హయాంలో మురళీమోహన్ కచ్చితంగా మెరక చేయాలని చెప్పారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో,అధికారంలోకి వచ్చిన వైసీపీ కనీసం దీనిని పట్టించుకోలేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడింది.నిర్మాణం పూర్తయినా ప్రారంభించకుండా వదిలేశారు.తిరిగి పవన్ చొరవతో త్వరలోనే ఇది ప్రారంభం కానుంది.

మీ అందరివాడిగానే ఉంటా : దుర్గేష్

నిడదవోలు నియోజకర్గ ప్రజల ఆశీర్వాదంతోనే మొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నా.ఈ ఏడాది మార్చి 12వ తేదీన నిడదవోలులో అడుగుపెట్టా. వైసీపీ నేతలంతా నా స్థానికతపై సందేహాలను ప్రజల్లోకి తీసుకెళ్లినా ప్రజలంతా నన్ను పూర్తిగా విశ్వసించి నాకు అండగా నిలబడ్డారు.

రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సేవ : వాసు

అసెంబ్లీకి తొలిసారి ప్రవేశించడం చాలా ఆనందంగా ఉంది. చట్ట సభలో చోటు లభించడం చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే పదవిని బాధ్యతగా భావిస్తా. రాజమండ్రి సిటీ అభివృద్ధిలో నాముద్ర కనిపించేలా కృషి చేస్తాను. తమ అధినేతలు చంద్రబాబు, లోకేష్ రుణం తీర్చుకోలేనిది.

రాజానగరం ప్రజలు అవకాశం ఇచ్చారు : బత్తుల

జనసేన అధినేత పవన్ కల్యాణ్ నన్ను ఆశీర్వదించి, పంపితే ప్రజలూ ఆశీర్వదించి ఎమ్మెల్యేను చేశారు. నేను మంచి సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చా.రాజానగరం ప్రజలు కల్పించిన ఈ అవకాశంతో నా వంతు సమాజ సేవ చేస్తా. చట్టసభ అసెంబ్లీలోకి ప్రవేశించడం చాలా ఆనందంగా ఉంది.

గోపాలపురాన్ని అభివృద్ధి చేస్తా : మద్దిపాటి

అసెంబ్లీలోకి తొలిసారి ఎమ్మెల్యేగా అడుగుపెట్టడం సంతోషంగా ఉంది. ప్రజా సేవ చేయాలనే మంచి సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చా. రాజకీయంగా గాడ్ ఫాదర్ లేకపోయినా చంద్రబాబు, లోకేశ్ నాకీ అవకాశం కల్పించారు. గోపాలపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాను.

నాడు.. ఈ గౌరవం ఏమైందమ్మా!

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 20 : ప్రభుత్వ అధికారులంటే పబ్లిక్ సర్వెంట్స్.. అది ఏ అధికారి అయినా ఇంతే.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వాళ్లు మాత్రం ప్రజల పక్షాన ఉండాలి.. అయితే గత ప్రభుత్వంలో మాత్రం అధికారులు అలా లేరు.. వైసీపీ పాలకులను మాత్రమే గౌరవించేవారు.. మిగిలిన ఏ పార్టీలకు చెందిన పాలకులు వచ్చినా కనీసం ప్రొటోకాల్ పాటించేవారు కాదు. ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినా గంటల తరబడి నిలబడాల్సిందే.. సుమారు 6 నెలల కిందట అప్పటి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై వినతిపత్రం ఇచ్చేందుకు స్పందన కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డ జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వం మారేసరికి సాదరంగా ఆహ్వానించారు. ప్రస్తుత అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గత ప్రభుత్వ హయాంలో ప్రజాసమస్యలపై ఎన్నోసార్లు కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే ఏ రోజు ప్రొటోకాల్ పాటించలేదు. అలాంటిది ఎమ్మెల్యే హోదాలో గురువారం జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయనకు కలెక్టర్ స్వాగతం పలుకుతూ కూర్చోబెట్టి గౌరవంగా మాట్లాడారు. ఆయన చెప్పిన సమస్యలను సావధానంగా విన్నారు.. సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.. ఇక అధికార పక్షమైనా.. స్వపక్షమైనా ఒకేలా స్పందించాలని ఆయన వెంట వచ్చిన నాయకులు అనడం గమనార్హం.



నాడు స్పందనలో నిలబెట్టి మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

నేడు ఎమ్మెల్యే కావడంతో గౌరవంగా కూర్చోబెట్టి మాట్లాడుతున్న కలెక్టర్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం!

కొవ్వూరు, జూన్ 20 : అతివేగం ప్రమాదకరం.. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా వాహనదారుల తీరులో మాత్రం మార్పు రావడంలేదు.. వేగంగా వెళ్లి ప్రమాదాలకు కారకులవుతున్నారు.గతంలో స్పీడ్ గన్ల వ్యవస్థ ఉండేది.. పరిమితికి మించి వెళ్లే వాహనాలపై అపరాధ రుసుం విధించేవారు.. దీంతో చాలా మంది పరిమిత వేగంతోనే వెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ స్పీడ్ గన్ల వ్యవస్థ మూలకు చేరడంతో వాహనదారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఎక్కడికక్కడ వన్ వే అమలులో ఉన్నా అతివేగం కారణంగా డివైడర్లు దాటుకుని వచ్చి మరీ ప్రమాదాలకు కారకులవుతున్నారు.గురువారం కొవ్వూరులో జరిగిన ప్రమాదమే అందుకు ఉదాహరణ. పెనుప్రమాదం త్రుటిలో తప్పినట్టే. గురువారం దొమ్మేరు వైపు నుంచి ఒక ఎర్టిగా కారు అతివేగంగా వస్తుంది.. కొవ్వూరు ఏబీఎన్ కళాశాల సమీపానికి వచ్చేసరికి ఎడమ వైపు నుంచి అడుగున్నర ఎత్తు ఉన్న డివైడర్‌పై నుంచి కుడి వైపునకు దూసుకొచ్చింది.అటుగా ఏదైనా కారు లేదా ద్విచక్రవాహనం వెళ్లి ఉంటే పెనుప్రమాదమే జరిగేది. ఆ సమయంలో రాజమహేంద్రవరం నుంచి 17 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు ఏలూరు వెళుతోంది. ఆ బస్‌ను ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదమేమీ జరగకుండా ఆగింది.ఈ ఘటనతో బస్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బస్సు ముందు సీటులో కూర్చున్న యర్నగూడెంకు చెందిన సిహెచ్.శిరీష తల బస్సు అద్దానికి తగలడంతో తీవ్ర గాయమైంది. 108 అంబులెన్స్‌లో గాయపడిన శిరీషను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు ముందుభాగంతో పాటు, కారు దెబ్బతిన్నాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేయవలసి ఉంది. ఆ కారులో యువకులు ఉన్నట్టు సమాచారం.


డివైడర్ దాటుకుని వచ్చి బస్సును ఢీకొన్న కారు



యోగాతో అందం..ఆరోగ్యం

ఆరోగ్యం అందాన్ని ఇస్తుంది. అందం ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. వీటన్నింటినీ యోగా ప్యాకేజీగా అందిస్తుంది. మహిళలు క్రమం తప్పకుండా యోగా చేస్తే చర్మాన్ని కాంతివంతం చేస్తుంది. శరీరాన్ని సరైన ఆకృతిలో పెడుతుంది. రోజంతా ఉత్సాహంగా, చురుగ్గా ఉంచుతుంది. రుతుక్రమం సరిగ్గా వచ్చేలా చూస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే రోజూ చేసే యోగా మహిళలను స్లిమ్ అండ్ ఫిట్‌గా మారుస్తుంది.

యోగా... మానవులకు యోగం. మానసిక శుద్ధితో పాటు శారీరక శుద్ధి చేసి మనిషిని ఆరోగ్యవంతంగా ఉంచగలిగే శక్తి యోగాకు ఉంది. యోగాను ఒక యాగంగా భావిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారనడంలో అతిశయోక్తి లేదు.

ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానంతో అంతర్గత అవయవాలకు ఉత్తేజం అందుతుంది. తద్వారా రోగాలు పటాపంచలవుతాయి. ఆధునిక వైద్యం దారిచూపని అనేక సమస్యలకు పరిష్కారం చూపే మహత్తు ప్రాచీన భారతీయ యోగాకు మాత్రమే ఉంది. ఒకప్పుడు మహర్షులు, యోగులకు మాత్రమే పరిమితమైన యోగా ఇప్పుడు దైనందిన జీవితంలో భాగమైంది. మారుమూల పల్లెలకు సైతం యోగా విస్తరించింది. జిల్లాలో వందకు పైగా యోగాభ్యాస కేంద్రాలు పనిచేస్తున్నాయి.

యోగా భారతీయ సంపద


శారీరక, మానసిక సమస్యలకు పరిష్కార మార్గాలు చూపే అద్భుత క్రియ

నేటి యాంత్రిక జీవనానికి దివ్యౌషధం

మనిషిలోని అంతర్గత శక్తులను చైతన్యం చేసేది యోగా. శరీరంతో పాటు మనోబుద్ధులు అత్యుత్తమ స్థాయిలో పనిచేసేందుకు యోగా దోహదపడుతుంది. యోగం అనే పదానికి కలయిక అని అర్థం. గతంలో లేని దానిని పొందడం.. ఇది వరకు తెలియని దానిని తెలుసుకోవడమే యోగా పరమార్థం. యోగా అంటే ఆసనాలు వేయడం.. శరీరాన్ని అనేక రీతుల్లో వంచడం.. గాలిని బిగబట్టడం.. వంటివిగా భావిస్తారు. ఇవన్నీ యోగశాస్త్రంలో ప్రాథమిక అభ్యాసాలు మాత్రమే. వీటివల్ల శారీరక రుగ్మతలెన్నో దూరం చేసుకోవచ్చు. మానసిక ప్రశాంతతను పొందవచ్చు. ఒత్తిడిని అధిగమించి విజయంవైపు అడుగులు వేయవచ్చు.

ఉరుకుల పరుగుల ఆధునిక జీవన విధానంలో ప్రతిఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల నుంచి ఉద్యోగులు, వ్యాపారులు.. ఇలా అన్ని రంగాల వారు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడపాల్సిన పరిస్థితి నెలకొంది. తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నవారు ఒక్కోసారి నేరాలకు పాల్పడడం, మరికొందరైతే ఆత్మహత్యాయత్నాలకు పాల్పడడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. మందులకు లొంగని మహమ్మారి ఒత్తిడిని మెలకువతో నియంత్రించే శక్తి యోగాకు ఉంది.

అమలాపురం రూరల్/ తుని రూరల్:



అమలాపురంలో యోగాసనాలు

ఒక యోగం

శారీరక ఆరోగ్యానికి

శరీరం, మనసు ఒకదాంతో ఒకటి ముడిపడి ఉంటాయి. శారీరక ఆరోగ్యమే మిగతా ఆరోగ్యాలకు పునాది. ఎందుకంటే 75 శాతం వ్యాధులకు మనసే కారణమని ఆధునిక పరిశోధనల్లో తేలింది. ఆధునిక జీవన విధానంలో అధిక రక్తపోటు, నిద్రలేమి వంటివెన్నో ఉన్నాయి. సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించేలా పతంజలి మహర్షి యోగాసనాలకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. యోగాలో ఎన్నెన్నో భంగిమలు. ఒక్కొక్కటి ఒక్కో శరీర భాగానికి ఆరోగ్యానిస్తుంది. వజ్రాసనం ఎసిడిటీని రూపుమాపుతుంది. శశాంకాసనం కాలేయ సమస్యలను దరిచేరనివ్వదు. భుజంగాసనం వెన్నునొప్పిని తగ్గిస్తుంది. వజ్రోలి లైంగిక శక్తిని పెంచుతుంది. వీటితో పాటు విద్యార్థులకు ఏకాగ్రతతో పాటు చక్కటి శరీర ఆకృతికి, బరువు తగ్గడానికి, నడుం, మెడ నొప్పి వంటివాటిని తగ్గించుకునేందుకు ఎన్నో ఆసనాలున్నాయి.



రకాలెన్నో..

ప్రాణాయామం చేయడం ద్వారా ప్రాణశక్తి పెరుగుతుందని విశ్వసించే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అందుకే యోగాభ్యాసం పట్ల మక్కువ పెంచుకుని యోగా శిక్షణా తరగతుల వైపు పరుగులు తీస్తున్నారు. యువ యోగా, పవర్ యోగా, హఠయోగా, అరుణ యోగా.. లాఫింగ్ యోగా, డ్యాన్స్ యోగా, సైంటిఫిక్ యోగా.. ఇలా సరికొత్త రూపాలను సంతరించుకుంటూ "ఆరోగ్య మహాయోగా"న్ని ప్రసాదిస్తోంది. గతంలో ఎన్నడూలేనంతగా యోగాపై జరుగుతున్న ప్రచారంతో సాధన చేసేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ప్రాణాయామానికి ప్రత్యేక స్థానం

యోగశాస్త్రంలో ప్రాణాయామానికి ప్రత్యేక స్థానం ఉంది. పూరక, కుంభక, రేచకాల ద్వారా శ్వాసను క్రమబద్ధీకరిస్తే శారీరక, మానసిక వికాసం సాధ్యం. భస్త్రిక మనసుమీద నియంత్రణ ఇస్తుంది. చెవి, ముక్కు, గొంతు సమస్యల నివారణకు ఉజ్జయి ఉపకరిస్తుంది. నాడీవ్యవస్థ పనితీరును నాడీశోధన మెరుగుపరుస్తుంది.

ఆరోగ్య ప్రదాయిని యోగా

శరీరశుద్ధితో పాటు మానసిక శుద్ధికోసం యోగా పితామహుడు పతంజలి మహర్షి అష్టాంగమార్గాన్ని ప్రజలకు అందించారు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార ప్రక్రియలు శారీరక శుద్ధికి ఎంతగానో ఉపకరిస్తాయి. ఇక ధారణ, ధ్యానం, సమాధి స్థితి మనసును శుద్ధిచేస్తాయి. వాటిని సాధన చేసే విధానాలను మహర్షి స్పష్టంగా వివరించారు. యోగా భారతీయ సనాతన విద్య. యోగశాస్త్రంలో ఎక్కడా దేవుని ప్రస్తావన ఉండదు. ఒకే ఒక సూత్రంలో మాత్రం సర్వజ్ఞుడైన వ్యక్తి అని మాత్రమే చెప్పారు. యోగా ఏ మత విశ్వాసానికి, ఏదో ఒక దేవునికి సంబంధించినది కాదు. ప్రపంచంలోని ప్రతి మనిషికీ శరీరం, ఇంద్రియాలు, మనసు ఒకటే.

డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు, యోగా గురువు, అమలాపురం



శ్రీప్రకాష్‌లో

యోగా దినోత్సవం

తుని రూరల్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో యోగా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ యోగా ద్వారా జ్ఞాపక శక్తి మెరుగవుతుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. జాతీయ స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్రీ ప్రకాష్ విద్యార్థులు క్లిష్టమైన ఆసనాలు వేసి అందరిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

డాలర్లు దోచేశారు!



స్వాధీనం చేసుకున్న డాలర్లు

అధిక మొత్తం ఆశ చూపి డాలర్లతో ఉడాయించిన ముఠా

ఆరుగురి అరెస్ట్.. మరో ఐదుగురి కోసం గాలింపు

రాజమహేంద్రవరం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి) : అమెరికా వెళ్లి డాలర్లు సంపాదించి తెచ్చుకున్నారు. కానీ అత్యాశతో ఓ ముఠా చేతికి దొరికిపోయారు. కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) టి.సర్కార్ గురువారం వెల్లడించారు. విశాఖపట్నానికి చెందిన వెలగల శివ శంకరరెడ్డి 50 వేల అమెరికన్ డాలర్లను భారత కరెన్సీలోకి మారకం చేసుకునే క్రమంలో విశాఖకు చెందిన కర్రి కనకరాజుతో పరిచయం ఏర్పడింది. తమకు డాలర్లు ఇస్తే భారత కరెన్సీలో డాలరుకు రూ.98 ఇస్తామని ఆశచూపారు. దీంతో బేరం కుదిరింది. మే నెల 30న దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలోని జడ్పీ హైస్కూల్ వద్దకు శంకరరెడ్డి డాలర్లు తీసుకొని వెళ్లారు. అక్కడికి కనకరాజుతో పాటు మరో పది మంది వచ్చి డాలర్లు ఉన్న బ్యాగ్‌ని లాక్కుపోయారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఈ కేసులో విశాఖకు చెందిన కనకరాజు, విజయనగరానికి చెందిన గణగల్ల అజయ్‌కుమార్, అల్లూరి జిల్లా సీలేరుకు చెందిన వంతల విష్ణు, పల్నాడు జిల్లా మల్లాది గ్రామానికి చెందిన సొంగా రమేశ్, విజయవాడకు చెందిన ఉడత రవితో సహా ఆరుగురిని గురువారం అరెస్టు చేసి 36 వేల డాలర్లు, ఇన్నోవా కారు, హోండా అమేజ్ కారు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ఐదుగురి కోసం గాలింపు చేపట్టామని తెలిపారు. అయితే పోలీసుల వివరణపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇండియన్ కరెన్సీలో సుమారు రూ.41 లక్షలకు సంబంధించిన భారీ నేరం విషయంలో ఏదో దాస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. నిందితులుగా పేర్కొన్న వారిలో అందరూ వివిధ జిల్లాలకు చెందినవాళ్లు. ఉదాహరణకు ఎక్కడో పల్నాడు జిల్లా ఒకరిదైతే ఇక్కడి అల్లూరి జిల్లా మరొకరిది. దీంతో వీళ్లందరూ ముఠాగా ఎలా ఏర్పడ్డారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలాగే శంకర్ రెడ్డికి అంత పెద్ద మొత్తంలో 50 వేల అమెరికన్ డాలర్లు ఎలా వచ్చాయనే స్పష్టత కూడా కొరవడింది. శంకర్ రెడ్డిది విశాఖ జిల్లా, నిందితులవి వివిధ ప్రాంతాలు. దేవరపల్లిలో దాడి ఎలా జరిగిందో వివరణ లేదు. దీంతో ఈ కేసు విషయంలో నిజాలు బయటకు రావాల్సిన అవసరం కనిపిస్తోంది.



మరమ్మతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఓఎన్జీసీ బావిలో మరమ్మతులు

మలికిపురం, జూన్ 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం తూర్పుపాలెం సముద్ర తీరంలోని కేశనపల్లి వెస్ట్ 38 ఓఎన్జీసీ ఆయిల్ కంపెనీ గ్యాస్ బావిలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ బావి నుంచి కొన్ని రోజులుగా గ్యాస్ రావట్లేదు. దీంతో గురువారం తూర్పుపాలెంలోని సీఏఎస్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కేశనపల్లి వెస్ట్ స్ట్రక్చర్ పరిధిలో అత్యధికంగా గ్యాస్ ఉత్పత్తి జరుగుతున్న బావులు ఇక్కడే ఉన్నాయి. రెండేళ్ల క్రితం మరమ్మతులు చేసినప్పుడు భారీ ఎత్తున గ్యాస్ ఆయిల్ లీకై పెను ప్రమాదం తప్పింది. అప్రమత్తమైన ఉన్నతాధికారులు ఈసారి అధునాతన యంత్ర పరికరాలను తెచ్చి బావులను బాగు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



బోరున విలపిస్తున్న భార్య

అంబాజీపేట, జూన్ 20: వ్యవసాయంలో కూలి పని చేసేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కముజువారిలంక గ్రామానికి చెందిన విత్తనాల నాగేశ్వరరావు (58) భార్య వెంకటలక్ష్మితో కలిసి గురువారం మధ్యాహ్నం పొలం పనికి బయల్దేరాడు. ఈ సమయంలో ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు నాగేశ్వరరావును వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. స్థానికులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించగా నాగేశ్వరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంబాజీపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు

రంపచోడవరం, జూన్ 20: బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడిన కేసులో ముద్దాయికి కాకినాడ స్పెషల్ పోక్సో కోర్టు జడ్జి కొండపల్లి శ్రీదేవి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షను ఖరారు చేస్తూ తీర్పును వెలువరించినట్లు ఎస్ఐ మోహన్ కుమార్ తెలిపారు. అల్లూరి జిల్లా వై.రామవరం మండలంలో ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను రంపచోడరంలో నివాసం ఉంటున్న మద్దికొండ సుధాకర్ మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఏఎస్పీ వకుల్ జిందాల్ ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. కేసులో సాక్ష్యుల వాంగ్మూలం ఆధారంగా జడ్జి కిడ్నాప్ నేరం కింద 6 నెలల సాధారణ జైలుశిక్ష, రూ.1000లు జరిమానా, పోక్సో చట్టం ప్రకారం 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు కేసును వాదించారు.

దేవదాయ మంత్రిని కలిసిన రత్నగిరి బృందం

అన్నవరం, జూన్ 20: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రిగా గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆనం రాంనారాయణరెడ్డిని అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్ర మోహన్, ఛైర్మన్ రోహిత్ ఇతర అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఈవో స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. అన్నవరం ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి ఈవోను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ విశ్వనాథరాజు పాల్గొన్నారు.



మంత్రికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 20: ఆర్థిక అక్షరాస్యతపై సమాజంలో ప్రతి ఒక్కరికీ కనీస అవగాహన కల్పించడమే ప్రత్యేక శిక్షణ తరగతుల ముఖ్యోద్దేశమని రిజర్వు బ్యాంకు జనరల్ మేనేజర్ ఆర్క్ మహన పేర్కొన్నారు. స్థానిక షెల్టన్ హోటల్‌లో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రతి మహిళ ఆర్థిక అక్షరాస్యతపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు రుణాలు, సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమలు అందజేసే రుణ మంజూరు విధి విధానాలపై ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి అవగాహన కల్పించారు. బ్యాంకులు అందజేసే పథకాలను ఎల్‌డీఎం వివరించారు.

'తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు తదితరులు

దివాన్‌చెరువు, జూన్ 20: తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు 1952-2022 పుస్తకాన్ని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి 2022 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద జిల్లాగా తూర్పుగోదావరి జిల్లా పేరు పొందిందన్నారు. ఈ జిల్లా రాజకీయాలను నన్నయ విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు బీవీవీ బాలకృష్ణ రచనా సంకలనం చేశారని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ కేంద్ర గ్రంథాలయంలోని నన్నయ భారతి, నన్నయ అధ్యయన కేంద్రంలోని గ్రంథాలను ఉపయోగించుకుంటూ బాలకృష్ణ ఈ పుస్తక రూపకల్పనకు కృషి చేశారని అభినందించారు. నన్నయ భారతి ద్వారా ఈ పుస్తకాన్ని ప్రచురించినట్లు చెప్పారు. ప్రతులు కావలసిన వారు నన్నయ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. గత చరిత్రను, ఒకనాటి సంఘటనలను విస్మరించకుండా రాబోయే సమాజానికి అక్షరబద్ధం చేసి ఇవ్వగలిగితే చరిత్రలోని లోటుపాట్లు నేటి సమాజానికి మార్గదర్శకం అవుతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, రచయిత బీవీవీ బాలకృష్ణ, సహాయకులు నన్నయ భారతి కోఆర్డినేటర్ పి.విజయనిర్మల, ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, అధ్యాపకులు ఆచార్య కేవీ రావు, ఆచార్య నరసింహారావు, కె.రాజరాజేశ్వరీదేవి తదితరులు పాల్గొన్నారు.

'విజయవంతంగా జేఎన్టీయూకే బృందం అమెరికా పర్యటన'

జేఎన్టీయూకే, జూన్ 20: పూర్వవిద్యార్థుల సంబంధాలను మెరుగుపర్చడం ద్వారా ఉన్నతవిద్యనభ్యసించేందుకు అమెరికా వెళ్లే విద్యార్థులకు ఉత్తమ మార్గదర్శకం లభిస్తుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. విదేశాల్లో స్థిరపడిన జేఎన్టీయూకే పూర్వవిద్యార్థులను వర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకుగాను వారి ఆహ్వానం మేరకు వీసీ ప్రసాదరాజు, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, జేవీఆర్ మూర్తిలతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం చేపట్టిన అమెరికా పర్యటన విజయవంతం అయ్యిందన్నారు. అక్కడ చేపట్టిన కార్యక్రమాలను వీసీ వివరించారు. యూఎస్ విశ్వవిద్యాలయాలతో కలిసి ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా సంయుక్తంగా ఎంఎస్ ప్రోగ్రాంలు నిర్వహించేందుకు తగిన చర్యలు చేపడతామన్నారు. సంయుక్త నిధుల కోసం దరఖాస్తు చేసేందుకు మిస్సోరి వర్సిటీతో చర్చలు జరిపామని, గతంలో ఇదే విశ్వవిద్యాలయంతో పార్టనర్‌షిప్-2020 గ్రాంట్‌ను 2020-22 మధ్య విజయవంతంగా అమలు చేసి అమెరికా ప్రభుత్వం నుంచి ఎక్సలెన్స్ సర్టిఫికెట్ పొందారని అన్నారు. 2015-2019 వరకూ చికాగో స్టేట్ యూనివర్సిటీతో కలిసి ఒబామాసింగ్ ఇనిషియేటివ్ గ్రాంట్స్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. వర్సిటీలో విద్యా వాతావరణాన్ని మరింత మెరుగుపరిచేందుకు కాలిఫోర్నియాకు చెందిన పూర్వవిద్యార్థులు తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీకి న్యాక్ ఏ+ కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించడం విద్యార్థులు మెరుగైన ప్యాకేజీలతో ప్లేస్‌మెంట్స్ పొందడం పట్ల ఆనందం వ్యక్తం చేశామన్నారు. సీఎస్‌యూతో కలిసి కొలాబొరేటివ్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం నిర్వహించేందుకు సీఎస్‌యూ ఉన్నతాధికారులతో సమావేశమై కోర్సు రూపకల్పనకు చర్చలు జరిపినట్లు తెలిపారు. వర్సిటీ ప్లాటినం జూబ్లీ, అలూమ్ని సెంటర్ నిర్మాణానికి పూర్వవిద్యార్థులనుంచి విరాళాలు సేకరించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సీతా, ముత్యాల భాస్కర్‌రావును బృందం తరపున కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. పూర్వవిద్యార్థులైన పారిశ్రామికవేత్తలతో సమావేశమై ఏఐలో ఇంటర్న్‌షిప్ అందించేందుకు ముందుకువచ్చిన పూర్వవిద్యార్థి డాక్టర్ వాసును అభినందించినట్లు తెలిపారు.

జేఎన్టీయూకే ఫార్మా డీ ప్రశ్నపత్రంలో గందరగోళం

జేఎన్టీయూకే, జూన్ 20: కాకినాడ జేఎన్టీయూకే పరిధిలో 14 కళాశాలలకు సంబంధించి 12 కేంద్రాల్లో ఫార్మాడీ కోర్సు ద్వితీయ సంవత్సరం పరీక్షలను నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించిన ఫార్మా థెరాప్యూటిక్స్-1 పరీక్షాపేపర్‌లో ఇదే కోర్సుకు సంబంధించిన తృతీయ సంవత్సర సిలబస్‌నుంచి 4 ప్రశ్నలు, 1 బిట్ వచ్చాయని తెలుసుకున్న విద్యార్థులు గందరగోళానికి గురై ఆందోళన చేశారు. విద్యార్థులంతా అధ్యాపకులను ప్రశ్నించగా పరీక్ష ముగిసే అరగంట ముందు 4 ప్రశ్నలు, ఒక బిట్‌ను ద్వితీయ సంవత్సర సిలబస్ నుంచి ఇచ్చి పరీక్షా సమయాన్ని ఒక గంట పెంచారు. దీనిపై వర్సిటీ పరీక్షల విభాగం డీఈ బి.బాలకృష్ణను వివరణ కోరగా ప్రశ్నలు తృతీయ సంవత్సరం సిలబస్ నుంచి రావడం వాస్తవమేనని విద్యార్థులు నష్టపోకుండా సమస్యను వెంటనే గుర్తించి ప్రశ్నలు మార్చి వాటిని రాసేందుకు సమయాన్ని పెంచామని కాబట్టి విద్యార్థులు యథావిధిగా పరీక్షలు రాశారని, వారు ఎలాంటి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు.

నేడు అంతర్వేదిలో సప్తనదీ జలాల మహా జ్యేష్ఠాభిషేకం

అంతర్వేది, జూన్ 20: అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సప్తనదీ జలాల మహా జ్యేష్ఠాభిషేకానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగే ఈ క్రతువులో పాల్గొనదలచిన భక్తులు రూ.400 టిక్కెట్ తీసుకోవాలన్నారు. మహాశాంతి హోమం కూడా జరుపుతామని అర్చకులు చెప్పారు.

యోగా, వెల్‌నెస్ ఫెస్టివల్ ప్యానల్ సభ్యునిగా సాంబశివరావు

అమలాపురం టౌన్, జూన్ 20: ముంబైలో దార్తి, హబీబీటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా, వెల్‌నెస్ ఫెస్టివల్‌కు దేశ, విదేశాల నుంచి 1200కు పైగా వైద్యులు, ప్రతినిధులు హాజరయ్యారు. 11 మంది సభ్యులతో జాతీయ స్థాయిలో ఏర్పాటుచేసిన ప్యానల్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి అమలాపురం పట్టణానికి చెందిన చిక్కం సాంబశివరావును మాత్రమే ఎన్నుకున్నారు. ఎకో వారియర్స్, లివింగ్ గ్రీన్ ఎవ్రీడే తదితర అంశాలపై సాంబశివరావు జాతీయ స్థాయి సదస్సులో చర్చించారు. లీడ్ ది లైఫ్ సీఏఫ్ శాంతిస్వరూప్ తదితరులు సాంబశివరావును అభినందించారు.

నేడు జిల్లావ్యాప్తంగా యోగా దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 20: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం బీజేపీ తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధి ఏడు నియోజకవర్గాల్లోని 30 మండలాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల్లోని వివిధ కూడళ్లలో మండల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు యోగా కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఉదయం 7 నుంచి 9గంటల వరకూ యోగాసనాలు జరుగుతాయన్నారు.

ఏజెన్సీ సమాచారం

డీఎస్సీ కోచింగ్ ఏర్పాటు చేయాలి



పీవోతో మాట్లాడుతున్న ఆదివాసీ ఉద్యోగ సంఘాల నాయకులు

రంపచోడవరం, జూన్ 20 : ఆదివాసీ నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఆదివాసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అభ్యర్థులు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను కలిశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ఎంపిక చేసిన డీఈడీ, బీఈడీ చేసిన నిరుద్యోగ అభ్యర్థులకు ప్రతి వైటీసీలో 50 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆదివాసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కంగల శ్రీనివాసు, ఆదివాసీ సంక్షేమ, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు మడకం ప్రసాద్‌దొర, చవలం శుభకృష్ణదొర, కంగల అబ్బాయి దొర, బంధం పోతన్నదొర, బందం రామకృష్ణ, కారం రామన్నదొర, నడిపూడి సంజీవరెడ్డి తదితరులు పీవోను కలిసిన వారిలో ఉన్నారు.

ఉద్యోగ బాధ్యతల స్వీకరణ



మోతుగూడెం, జూన్20: చింతూరు మండలం మోతుగూడెంలో గురువారం సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఓఅండ్ఎం సర్కిల్ ఎస్ఎస్ మీరా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన నెల్లూరు దామోదరం సంజీవయ్య థర్మల్ ప్రాజెక్టులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేశారు. పదోన్నతిపై సీలేరు కాంప్లెక్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓఅండ్ఎం సర్కిల్ బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ నూరం మోహన్‌రావు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సీఐటీయూ యూనియన్ నాయకులు జాజుల రత్నాకర్, వేమగిరి కిరణ్, పి.ఆనంద్‌బాబు, రామారావు, వాక శ్రీనివాసరావు, పలు యూనియన్ల సభ్యులు అభినందనలు తెలిపారు.

మొబైల్ కోర్టు నిర్వహణ



మొబైల్ కోర్టు నిర్వహిస్తున్న దృశ్యం

ఎటపాక, జూన్ 20: ఎటపాక తహసీల్దార్ కార్యాలయం సమావేశపు హాల్లో గురువారం మొబైల్ కోర్టును నిర్వహించారు. రంపచోడవరం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఈ.జాన్‌రాజ్ నేతృత్వంలో కేసులు పరిశీలించారు. విలీన మండలాల నుంచి పలు కేసుల కక్షిదారులు పాల్గొన్నారు. అయితే ఈ మొబైల్ కోర్టులో మొత్తం 150 కేసులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రమణారావు, గుడపర్తి నాగరాజు, విజ్జగిరి రవితేజ పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ గ్రామసభ ఏర్పాటు



గ్రామసభలో మాట్లాడుతున్న జడ్పీటీసీ రంగారెడ్డి

వరరామచంద్రాపురం, జూన్ 20: మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని చొప్పల్లి గ్రామంలో తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ ఆధ్వర్యంలో గురువారం ఆర్అండ్ఆర్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ చొప్పల్లి గ్రామంలోని పోలవరం నిర్వాసితులైన 196 కుటుంబాల వారికి ఎటపాక మండలంలోని లింగాలపల్లి, రామగోపాలపురం గ్రామాల్లోను, లక్కవరం మండలం లక్కొండ గ్రామంలోను ఆర్అండ్ఆర్ కాలనీలు ఏర్పాటు చేయడానికి చొప్పల్లి గ్రామస్థుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం జడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ ఈ మండలాల్లోని ఏ గ్రామాల్లోనైనా కాలనీలు నిర్మించేందుకు నిర్వాసిత కుటుంబాల వారి ఇష్ట ప్రకారమే నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మడకం రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఏవీ రమణ, టీడీపీ నాయకులు బీరక సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో చంద్రబాబు, పవన్ ఫొటోలు



అధికారులకు చిత్రపటాలను అందిస్తున్న నాయకులు

ఎటపాక, జూన్ 2: ఎటపాకలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఏర్పాటు చేసేందుకు గురువారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ చిత్రపటాలను వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, కిలారి వెంకటేశ్వరరావు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాటి చలపతి, మాజీ వైస్ ఎంపీపీ రావి మాధవరావు, టీడీపీ నాయకులు నిడదవోలు సూర్యనారాయణ, బొల్లా పుల్లయ్య, బాచినేని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అడ్డతీగల, జూన్ 20: యల్లవరం గ్రామంలో గురువారం వ్యవసాయ ఉత్పత్తి కార్యాలయ ఆవరణలో రైతులకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జర్తా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన 200 మంది గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, మండల కార్యదర్శి వి.సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ బి.నూకాలమ్మ, మాజీ సర్పంచ్ కారు అబ్బులు, యూనిట్ ఇన్‌చార్జ్ తేలు చిన్న, తిమ్మాపురం ఉపసర్పంచ్ ఎ.శ్రీను తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకో జెండా ఉండాలి

» జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్
» ఘనంగా రెవెన్యూ దినోత్సవం
» పలువురు అధికారులు, ఉద్యోగులకు సత్కారాలు



పదవి విరమణ పొందిన అధికారులను సన్మానించిన జేసీ, ఇతర అధికారులు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 20: రెవెన్యూ ఉద్యోగులు క్రమశిక్షణ, అంకితభావంతో ప్రజలే ముందు అనే విధానంతో వ్యవహరించాలని జేసీ తేజ్‌భరత్ పేర్కొన్నారు. రెవెన్యూ దినోత్సవాన్ని పలుచోట్ల గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ మద్రాసు ప్రెసిడెన్సీ ఏర్పాటు చేసిన రోజును పురస్కరించుకొని ప్రతి ఏడాది జూన్ 20వ తేదీని రెవెన్యూ దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రభుత్వ శాఖల్లో రెవెన్యూ, పోలీస్ శాఖల పని తీరు కీలకమని రాజమహేంద్రవరం ఇన్‌చార్జ్ ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు డ్రెస్‌కోడ్, ఒక జెండా రూపకల్పన చేసే ఆలోచన మేరకు ప్రభుత్వానికి సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన డీఆర్వో ఎం.జితేంద్ర, ఏవో కె.శ్రీనివాసరావు, తహశీల్దార్లు ఎంఆర్.గణేశ్వరరావు, సీవీ సూర్యనారామణ, కె.చంద్రశేఖర్‌లను సత్కరించారు. పలువురు రెవెన్యూ అధికారులకు జేసీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

బిక్కవోలు: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహ శీల్దార్ వి.కన్యాకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలన్నింటిలో తల్లి శాఖగా కొనియాడబడేది రెవెన్యూ శాఖయేనని అన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత వీఆర్వో వడ్డాది రామకృష్ణను టీడీపీ నాయకులు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చింతా శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, డీటీ సత్యకృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కడియం: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తమ సేవలందించిన తహశీల్దారు బి.రమాదేవికి జేసీ తేజ్‌భరత్, ఇన్‌చార్జి ఆర్డీవో కృష్ణనాయక్ అభినందన పురస్కారం అందించారు. అనంతరం స్థానిక తహశీల్దారు కార్యాలయంలో జరిగిన రెవెన్యూ దినోత్సవంలో ఆమెను కార్యాలయ అధికారులు, వీఆర్వోలు ఘనంగా సత్కరించారు.

రాజానగరం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థ ఆవిర్భవించి 250 వసంతాలు పూర్తయ్యాయని, సంక్షేమాభివృద్ధికి, పరిపాలనకు మార్గదర్శిగా నిలిచిందన్నారు. పదవీ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ అబ్దుల్‌రెహమాన్, డిప్యూటీ తహశీల్దార్ జనార్దన్, రీసర్వే డీటీ శాంతి, ఆర్ఐ సీతారాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పంచాయతీ కార్యాలయం పక్కన కూటమి నాయకులతో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దార్ లతీఫ్‌పాషా మాట్లాడారు. మద్రాసు ప్రెసిడెన్సీ ఏర్పాటు చేసిన రోజును పురస్కరించుకొని ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు క్రమశిక్షణతో వ్యవహరించాలన్నారు. ముందుగా రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బలిరెడ్డి దుర్గారావు, గారపాటి రాంబాబు, పోతుల చిన్ని, గుండిబల్లి ప్రసాద్, మైలవరపు సాయిరాం, పోతుల వీరసుందర్రావు, కడిమి సాయిబాబు పాల్గొన్నారు.

అనపర్తి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ సహా సిబ్బందికి కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు రికార్డులను క్రమబద్ధీకరిస్తూ రెవెన్యూ అధికారులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కర్రి వెంకటరామారెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.



కడియం తహశీల్దారు రమాదేవిని అభినందిస్తున్న జేసీ, ఇన్‌చార్జి ఆర్డీవో

విద్యార్థులు క్రమశిక్షణ అలవరుచుకోవాలి



గాదాల మోడల్ స్కూల్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

» జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు
» గాదాలలో జడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్ సందర్శన

కోరుకొండ, జూన్ 20: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణ అలవరుచుకోవాలని, ఉత్తమ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. మండలంలోని గాదాల జడ్పీ హైస్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశలో 25 సంవత్సరాలు పాటు కష్టపడి చదివితే మిగిలిన జీవితం అంతా హాయిగా ఉంటుందన్నారు. ఇంగ్లీషు, హిందీ పాఠాలు చదివించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించబోమని, ప్రతిఒక్కరు నిబంధనలతో పని చేయాలన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.సురేష్‌కుమార్‌ను పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, అడ్మిషన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. యుడైస్‌లో ప్రోగ్రెసివ్ మాడ్యూల్‌ను పూర్తి చేశారా అని ప్రశ్నించారు. రికార్డులను పరిశీలించారు. ఒకటి, రెండు తరగతులు ఉపాధ్యాయులు 90 రోజుల విద్య ప్రణాళికను, కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. డీఈవో వెంట సమగ్ర శిక్ష సీఎంవో శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్ఎం జ్యోతికుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోరుకొండ హైస్కూల్లో విద్యాకిట్లు పరిశీలన

కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్‌ను రాజమహేంద్రవరం ఉప విద్యా శాఖాధికారి, ఎంఎస్ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్యాకానుక కిట్లను, బ్యాగ్‌లను, బూట్లను పరిశీలించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యాకానుక కిట్లు పంపిణీ, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీని పరిశీలించారు. మండల విద్యావనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో-1, పి.కుశలవదొర, ఎంఈవో-2 శారదలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యావనరుల కేంద్రం సిబ్బంది, ఇన్‌చార్జి హెచ్ఎం రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీకి శాస్త్రవేత్తలు చేరువకే

రీచ్ యువర్ పంచాయతీ

» ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ వెంకటనరసింహారావు



రైతులకు వ్యవసాయ సంబంధిత పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు/పెరవలి, జూన్ 20: ప్రతి పంచాయతీకి శాస్త్రవేత్తలు చేరువకావాలన్న లక్ష్యంతోనే వ్యవసాయ విశ్వవిద్యాలయం రీచ్ యువర్ పంచాయతీ కార్యక్రమం నిర్వహిస్తోందని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. ఇందులో భాగంగా పెరవలి మండలం కానూరులో రైతు సదస్సు నిర్వహించినట్టు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ సదస్సులో ప్రస్తుత సార్వాకు సంబంధించిన నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి, ఎరువుల వాడకం గురించి వివరించామన్నారు. ఒక కిలో విత్తనానికి కార్బండిజమ్ 25శాతం + మాంకోజెబ్ 50శాతం మిశ్రమ శిలీంధ్రనాశని 2గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి విత్తనశుద్ధిలో వాడాలన్నారు. నారుమడికి.. 10-12 రోజుల వ్యవధిలో 3దఫాలు దమ్ముచేసి చదును చేయాలన్నారు. 5సెంట్లు నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. జింకు లోపం గమనిస్తే 2 గ్రాముల జింకుసల్ఫేటు ఒకలీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటుకు 160 గ్రాముల చొప్పున వేయాలని, అలాగే నారు తీయడానికి వారం ముందుకూడా సెంటుకు 160 గ్రాములు చొప్పున వేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సిబ్బందికి ఎలుకల నివారణ, చీడ పురుగుల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తనతో బాటు ఏరువాక శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమావతి, సర్పంచ్ బి.మధుపూర్ణచందు, ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్, వ్యవసాయాధికారి ఎ.మేరీకిరణ్ తదితరులు పాల్గొన్నారన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా దర్బార్ ఏర్పాటుకు చర్యలు: ఎమ్మెల్యే బత్తుల



మంత్రి దుర్గేష్‌కు మొక్కను అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, జూన్ 20: సత్వర ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని అందుకోసం ప్రజాదర్బార్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. మన ప్రభుత్వం మన సుపరిపాలన పేరిట ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు రంగం సిద్ధం చేస్తున్నామ న్నారు. గత ప్రభుత్వంలో పరిష్కారం కాని సమస్యలతో పాటు ప్రస్తుత సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళతామన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం అయిన వెంటనే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. దానిలో భాగంగా కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండల ప్రధాన కేంద్రాల్లో ప్రజా దర్బార్‌ను ఏర్పాటు చేయనున్నామన్నారు. ప్రజలకు ఏదైనా సమస్య ఉంటే ఈ ప్రజాదర్బార్‌కు వచ్చి అర్జీ చేసుకోవాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర టూరిజం సాంస్కృతిక, సినిమా ఆటోగ్రఫీ శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కందుల దుర్గేష్‌ను ఎమ్మెల్యే బత్తుల గురువారం ఆయన ఛాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన



రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 20: శ్రీ రాధాకృష్ణ సంగీత, నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురువారం ఆనం కళాకేంద్రంలో మునిసిపల్ కార్పొరేషన్, గెయిల్ ఇండియా సంయుక్త సహకారంతో సాంస్కృతిక ప్రదర్శనలు రాత్రి 9గంటల వరకు నిర్విరామంగా జరిగాయి. మలేషియా, తెలంగాణ, చెన్నై తదితర ప్రాంతాల నుంచి కళాకారులు హాజరై నృత్య ప్రదర్శనలు చేశారు. గోదావరి నిత్యహారతి సందర్భంగా మలేషియాలోని శ్రీ నందిగేశ్వర్ డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీకి చెందిన భరత కళా శిఖామణి, ఆడల్ అరుసు గురుశ్రీ డాక్టర్ చంద్రమోహన్ రామస్వామి, ఆయన శిష్య బృందం ఇచ్చిన భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. మలేషియాలో స్థిరపడిన కోనసీమ జిల్లా కొత్తపేట మండలం నరేంద్రపురానికి చెందిన రాకేష్ గరిమెళ్ల కుమార్తె తన్వి ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కె.రామచంద్రమోహన్, అసిస్టెంట్ కమిషనర్ వీవీ పల్లంరాజు సౌజన్యంతో జరిగిన ఈ ప్రదర్శనలో గురుశ్రీ, ఇంద్ర సుగిన్, థైరీసా దినేష్, యోచన, ఖావీయా, శర్మిత, రష్మిత, సూక్షణ దినేష్ పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్‌కు నల్లమిల్లి శుభాకాంక్షలు



ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూన్ 20: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొణిదల పవన్‌కల్యాణ్‌ను గురువారం విజయవాడలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌ను సత్కరించగా ఆయన కూడా నల్లమిల్లికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అక్కడి ఇరిగేషన్ అతిథి గృహంలో జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబును నల్లమిల్లి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు కలిసి పిఠాపురంలో ఎన్నికల సందర్భంగా జరిగిన పలు అంశాలను ముచ్చటించారు.

బీజేపీ ప్రజాప్రతినిధుల సమావేశంలో రామకృష్ణారెడ్డి

విజయవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన నల్లమిల్లిని పార్టీ ప్రతినిధులు సత్కరించి మొమెంటో అందజేశారు. తదుపరి జరిగన కార్యక్రమంలో నల్లమిల్లి ప్రసంగిస్తూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా ప్రతినిధులు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలో బీజేపీ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలు సహా పలువురు పార్టీ పెద్దలు పాల్గొన్నారు.

నీట్ అక్రమాలపై విచారణ జరిపించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 20: దేశవ్యాప్తంగా వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షల్లో పెద్దఎత్తున జరిగిన అక్రమాలు, అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం రాజమహేంద్రవరం టీటీడీ కల్యాణమండపం రోడ్డులో ఎస్ఎఫ్ఐ రాజమహేంద్రవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా మాట్లాడుతూ నీట్ పరీక్షపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తినందున పరీక్షను మరలా నిర్వహించాలన్నారు. బాధిత విద్యార్థులందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.రాంబాబు, కె.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై శిక్షణ

రాజమహేంద్రవరం, జూన్ 20(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో 40గంటల మధ్యవర్తిత్వ శిక్షణలో కాన్సెప్ట్ అండ్ టెక్నిక్స్ ఆఫ్ మీడియేషన్‌లో భాగంగా ఓరియెంటేషన్ ప్రోగ్రాం గురువారం జరిగింది. తమిళనాడుకు చెందిన సీనియర్ ట్రైనర్ విజయ కమల న్యాయవాదులకు పలు అంశాలను విశదీకరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, సీనియర్ న్యాయవాది ఎం.శివ సుబ్రహ్మణ్యం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వీరేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి

రంగంపేట, జూన్ 20: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఈబీ సీఐ ఎస్.రాంబాబు పిలుపునిచ్చారు.గురువారం రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.మాధురి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నార్కొటిక్ డ్రగ్స్ అయిన గంజాయి, చారీష్, ఆశిష్, నల్లమందు, బ్రౌన్‌షుగర్, సింథటిక్ డ్రగ్స్‌ను వాడడం వల్ల ఆరోగ్యం పాడవుతుందని, యువత చెడు వ్యసనాల బారిన పడతారన్నారు. మత్తు పదార్థాల కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.చెన్నారావు, ఎస్ఈబీ ఎస్ఐ జి.అనిల్, కళాశాల అధ్యాపకులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి అనగానిని కలిసిన మార్గాని సోదరులు

కడియం, జూన్ 20: కడియం నర్సరీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంత్రి సత్యప్రసాద్‌ను టీడీపీ నాయకులు మార్గాని సత్యనారాయణ, మార్గాని వీరబాబు గురువారం అమరావతిలో కలిశారు. విదేశీ రకానికి చెందిన మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపి, కడియం నర్సరీలకు రావాలని ఆహ్వానించారు. నర్సరీ రుణాలపై మార్టిగేజ్ ఫీజులు రైతులకు భారంగా మారాయన్నారు. అలాగే నర్సరీ రైతులను వారు మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. కడియం నర్సరీల అభివృద్ధికి తమ శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు చేపడతామని మంత్రి అనగాని తెలిపారు.

కూటమి నాయకుల సంబరాలు

బిక్కవోలు, జూన్ 20: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీరించిన సందర్భంగా బుధవారం రాత్రి పందలపాకలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జనసేన మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు కేకు కట్ చేశారు. అనంతరం భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో పడాల చినబుజ్జి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి, సూరిబాబు, శ్రీనివాస్, ప్రసాద్, మణికంఠ, గంగరాజు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వ్యాధి ప్రాణాంతకం

కడియం, జూన్ 20: సికిల్‌సెల్ వ్యాధి ప్రాణాంతకమైనదని, నిరక్ష్యం చేస్తే ప్రాణాలనే బలిగొంటుందని కడియం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర్ తెలిపారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో గురువారం సికిల్ సెల్ వ్యాధిపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. మనిషి శరీరంలో కొడవలిలా వంకర తిరిగి ఉన్న ఎర్ర రక్తకణాలనే సికిల్‌సెల్ అంటారన్నారు. 20నుంచి 25 రోజుల జీవిత కాలం ఉండే ఈ ఎర్ర రక్తకణాలు కొడవలి మాదిరిగా ఉండటడంతో రక్తాన్ని అవయవాలకు చేరవేయడంలో ఇబ్బందులు సృష్టిస్తాయని, అప్పుడు ఎర్ర రక్తకణాల సంఖ్య తగ్గి మనిషి వ్యాధి బారిన పడతారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, వైద్యసిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 20: పేద విద్యార్థులకు రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే.విశ్వేశ్వరరెడ్డి నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి కళాశాల ఆఫీసులో క్వారీ ఏరియాలోని పేద విద్యార్థులకు గురువారం నోటుపుస్తకాలు,పెన్నులు అందజేశారు.







పెద్దాయనకు దక్కిన గౌరవం : ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఇలా ప్రమాణ స్వీకారం చేయించారు. 174 మంది శాసనసభ్యులతో గోరంట్ల ప్రమాణస్వీకారం చేయిస్తారు..



అనే నేను..

నేడు కూటమి ప్రభుత్వ తొలి అసెంబ్లీ

- ప్రొటెం స్పీకర్‌గా గోరంట్ల
- ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం
- మూడు జిల్లాల్లో 21 మంది
- రంపచోడవరం నుంచి ఒకరు
- వీరిలో 12 మంది కొత్తవారే
- ముగ్గురికి మంత్రి పదవులు
- డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్
- 10 మందికి మళ్లీ ఛాన్స్
- అందరూ కూటమి సభ్యులే

(రాజమహేంద్రవరం/కాకినాడ/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ఏర్పడిన తర్వాత తొలిసారిగా అసెంబ్లీ సమావేశాలు శుక్రవారం ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలందరితో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీనికోసం ముందుగా ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇక 21, 22వ తేదీల్లో జరిగే రెండు రోజుల సమావేశాలను గోరంట్ల బుచ్చయ్యచౌదరి నిర్వహిస్తారు. శుక్ర, శని వారాల్లో మొత్తం 174 మంది ఎమ్మెల్యేలతోనూ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేత కూడా ఆయన ప్రమాణ స్వీకారం చేయిస్తారు. 22న రాష్ట్ర స్పీకర్‌ను ఎన్నుకున్న తర్వాత ఆయన బాధ్యత తీరిపోతుంది. ఏడు సార్లు అసెంబ్లీకి ఎన్నికైన గోరంట్ల బుచ్చయ్యచౌదరికి గౌరవంగా ఈ అవకాశం దక్కింది. రాజమండ్రి సిటీ నుంచి నాలుగు సార్లు, రాజమండ్రి రూరల్ నుంచి మూడు సార్లు గోరంట్ల శాసనసభ్యుడిగా ఎన్నికైన సంగతి తెలిసిందే. గతంలో మంత్రిగా కూడా పనిచేశారు.ఏ ప్రాధాన్యతా క్రమంలో అసెంబ్లీలో ప్రమాణ స్వీకారాలు ఉంటాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ముగ్గురు మంత్రులూ బాధ్యతల్లోకి..

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇందులో పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, అటవీ, పర్యావరణ శాఖల మంత్రిగా ఇప్పటికే బాధ్యతలు స్వీకరించగా, నిడదవోలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కందుల దుర్గేష్ టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగాను, రామచంద్రపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన వాసంశెట్టి సుభాష్ కార్మిక శాఖా మంత్రిగాను గురువారం బాధ్యతలు స్వీకరించారు.అయితే వీరు ముగ్గురితో కూడా శాసనసభలో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

తూర్పుగోదావరి నుంచి...

నిడదవోలు జనసేన ఎమ్మెల్యే కందుల దుర్గేష్‌కు మంత్రి పదవి దక్కిన సంగతి తెలిసిందే. ఆయన గురువారం సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవర నగర నివాసి అయిన మంత్రి దుర్గేష్ తాత పోతుల వీరభద్రరావు రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగానూ, మున్సిపల్ చైర్మన్‌గా పలుదఫాలుగా పనిచేశారు. దుర్గేష్ అసెంబ్లీలోకి తొలిసారి ప్రవేశిస్తున్నారు. ఎమ్మెల్సీగా గతంలో శాసనమండలిలో ఆరేళ్లపాటు ఉన్నారు. ఆయన రాజమహేంద్రవరం సిటీకి చెందిన నాయకుడైనప్పటికీ నిడదవోలు నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలవడంతో పాటు మంత్రి పదవి కూడా దక్కించుకోవడంతో ఎక్కువ దృష్టి ఆయనకు నిడదవోలు మీదే ఉంటుంది. త్వరలో అక్కడ సొంతిల్లు కూడా ఏర్పాటుచేసుకోనున్నారు. ఇక కొవ్వూరు నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన ముప్పిడి వేంకటేశ్వరరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో ఆయన గోపాలపురం నుంచి టీడీపీ అభ్యర్థిగా గెలిచి అసెంబ్లీకి వెళ్లారు. ఇవాళ కొవ్వూరు నుంచి గెలిచారు. అనపర్తి నుంచి కూటమి తరపున బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కూడా రెండో సారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2014లో టీడీపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి వెళ్లిన రామకృష్ణారెడ్డి ఈసారి పొత్తు వల్ల అనూహ్యంగా బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు. ఆయన ఈసారి బీజేపీ ఎమ్మెల్యేగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.జిల్లాలో ఏడుగులు ఎమ్మెల్యేలకుగాను నలుగురు తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. నిడదవోలు నుంచి కూటమి తరపున గెలిచిన రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. 2019లో వైసీపీ సునామీలో కూడా ఆయన సతీమణి ఆదిరెడ్డి భవానీ టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన సంగతి తెలిసిందే. ఆయన తండ్రి అప్పారావు ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన తల్లి రాజమండ్రి కార్పొరేషన్ తొలి మేయర్. రాజానగరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన బత్తుల బలరామకృష్ణ తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. ఇక గోపాలపురం నుంచి టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కూడా తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

కాకినాడ జిల్లా నుంచి..

ఎన్నికల అనంతరం అసెంబ్లీ శుక్రవారం కొలువుతీరనున్నది. కాకినాడ జిల్లా నుంచి నలుగురు శాసనసభ్యులు తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించి శాఖాపరంగా విజయవాడలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, తుని, ప్రత్తిపాడు, పెద్దాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, యనమల దివ్య, వరుపుల సత్యప్రభ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ జిల్లా నుంచి అమరావతికి తరలివెళ్లారు. జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉండగా, ఇందులో పిఠాపురం నుంచి జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసెంబ్లీకి ఎన్నికకావడం ఇదే తొలిసారి. 2014 ఎన్నికల ముందు జనసేన పార్టీ స్థాపించిన పవన్ 2019 ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. ప్రస్తుత ఎన్నికల్లో రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించడమే కాకుండా తన పార్టీ తరపున పోటీ చేసిన 21 మంది శాసనసభ్యులుగా ఎన్నికకావడంతో విజయదరహాసంతో సభలో అడుగుపెట్టనున్నారు. అసెంబ్లీలో రెండో అతి పెద్ద పార్టీగా జనసేన ఉండనున్నది. ప్రత్తిపాడు నుంచి వరుపుల సత్యప్రభ, తుని నుంచి యనమల దివ్య, కాకినాడ రూరల్ నుంచి పంతం నానాజీ తొలిసారి సభలో అడుగుపెట్టనున్నారు. సత్యప్రభ భర్త రాజా గత ఎన్నికల్లో పోటీచేసినా విజయం సాధించలేకపోయారు. రాజా ఆకస్మిక మరణంతో రాజకీయాల్లోకి వచ్చిన సత్యప్రభ తాను పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే విజయం సాధించారు. అదే విధంగా మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుమార్తె అయిన దివ్య తొలి ఎన్నికల్లోనే గెలుపును సొంతం చేసుకున్నారు. పలుసార్లు ఎన్నికల్లో పోటీ చేసి విజయతీరాలకు చేరలేకపోయిన జనసేన నేత పంతం నానాజీ ఈ సారి మాత్రం జిల్లాలోనే రికార్డుస్థాయి మెజార్టీతో కాకినాడ రూరల్ నుంచి గెలుపొందారు. ఇప్పటికే పలుసార్లు ఎమ్మెల్యేలుగా పనిచేసిన కాకినాడ, జగ్గంపేట ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు), జ్యోతుల నెహ్రూలు మరోమారు అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. పెద్దాపురం నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నిమ్మకాయల చినరాజప్ప అసెంబ్లీకి వెళ్లనున్నారు.

కోనసీమ జిల్లా నుంచి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈసారి ముగ్గురు ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వీరిలో వాసంశెట్టి సుభాష్ తొలిసారిగా ఎమ్మెల్యేకావడంతో పాటు అనూహ్యంగా మంత్రిగానూ బాధ్యతలు స్వీకరించారు. జనసేన నుంచి రాజోలులో పోటీచేసి గెలిచిన దేవ వరప్రసాద్ కూడా తొలిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. వరప్రసాద్ సీనియర్ ఐఏఎస్. అలాగే పి.గన్నవరం నుంచి జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన గిడ్డి సత్యనారాయణ తొలిసారిగా ఎమ్మెల్యేగా అసెంబ్లీ మెట్లు ఎక్కనున్నారు. సత్యనారాయణ కూడా పోలీసు శాఖలో అధికారిగా పనిచేశారు. ఇక మండపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన వేగుళ్ల జోగేశ్వరరావు వరుసగా నాలుగోసారి శాసనసభ్యుడిగా అడుగుపెడుతున్నారు. కొత్తపేట నుంచి ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికైన బండారు సత్యానందరావు కూడా నాలుగో సారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. అమలాపురం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అయితాబత్తుల ఆనందరావు రెండోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా, ముమ్మిడివరం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన దాట్ల బుచ్చిబాబు మూడోసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలకు నలుగురు సీనియర్లు, ముగ్గురు తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు.

రంపచోడవరంలోనూ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి రంపచోడవరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన మిరియాల శిరీషాదేవి కూడా తొలిసారి అసెంబ్లీలోకి అడుగుపెడుతున్నారు. అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్న ఈమె ఏకంగా అసెంబ్లీలోకి టీడీపీ ఎమ్మెల్యేగా అడుగుపెడుతుండడం విశేషం.

కొత్త ఎమ్మెల్యేలదే హవా..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాగా చూసినా, కొత్తగా ఏర్పడిన మూడు జిల్లాల పరిధిలో చూసినా తొలిసారిగా ఎమ్మెల్యేలుగా అడుగుపెడుతున్న వారే అధికంగా ఉండడం విశేషం. మూడు జిల్లాల నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తుండగా, వీరంతా మొదటిసారి అసెంబ్లీలోకి అడుగు పెడుతున్నవారే. కాకినాడ జిల్లా నుంచి తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ రూరల్ నుంచి ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీ లోకి అడుగు పెడుతుండగా, అటు రంపచోడవరం నుంచి ఎమ్మెల్యే తొలిసారిగానే అడుగుపెడతారు.డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి రామచంద్రపురం, పి.గన్నవరం, రాజోలు నుంచి కొత్తవారే అసెంబ్లీలోకి అడుగుపెడుతుండగా,తూర్పుగోదావరి జిల్లా నుంచి రాజమండ్రి సిటీ, రాజానగరం,నిడదవోలు, గోపాలపురం ఎమ్మెల్యేలు తొలిసారిగా అసెంబ్లీ మెట్లు ఎక్కుతున్నారు. మూడు జిల్లాల్లో 21 నియోజకవర్గాలు, అటు రంపచోడవరం నియోజకవర్గం మొత్తం 22 మందిలో 12 మంది కొత్తవారే, పది మంది సీనియర్లు.







మంత్రి కందుల దుర్గేష్‌కు అభినందనలు తెలుపుతున్న శేషారావు

నా శాఖకు వన్నె తెస్తా : దుర్గేష్

నిడదవోలు,జూన్ 20 : మంత్రిగా నా శాఖకు వన్నె తెస్తానని రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.అమరావతిలో గురువారం సాయంత్రం 5.51 గంటలకు ఆయన మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన వెంట కుమారుడు డాక్టర్ కందుల కృష్ణతేజ, డాక్టర్ సుస్మిత, అల్లుడు ఈలి సత్యేంద్ర, కుమార్తె ఈలి శ్రీరంగప్రియ ఉన్నారు.అనంతరం కందుల దుర్గేష్‌కు నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శుభాకాంక్షలు తెలిపారు.నిడదవోలు నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచిన కందుల దుర్గేష్ మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు.లండన్ నుంచి ఫోన్ చేసి డాక్టర్ తోపరాల కల్యాణ్ చక్రవర్తి అభినందనలు తెలిపారు.సిటీకేబుల్ ఎండీ నీలం నాగేంద్ర ప్రసాద్, ఆనందం వెంకటేశ్వర్లు, జనసేన నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భోగవల్లి ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపారు.



అసెంబ్లీలోని తన చాంబర్‌లో తల్లిదండ్రులు, భార్య పిల్లలతో మంత్రి వాసంశెట్టి సుభాష్

చాంబర్‌లో మంత్రిగా తొలిసంతకం పెడుతున్న సుభాష్

కార్మికుడిగా పని చేస్తా : సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), జూన్ 20 : కార్మికుల సంక్షేమానికి తాను కూడా ఒక కార్మికుడిగా పని చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా వాసంశెట్టి సుభాష్ చెప్పారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వేదపండి తుల మంత్రోచ్ఛరణల నడుమ చాంబర్‌లోకి ప్రవేశించారు. సతీమణి లక్ష్మీసునీత, కుమార్తెలు, తల్లిదండ్రులతో కలిసి పూజలు జరిపారు. ఉదయం 7.34 గంటలకు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం సుభాష్ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలు 13 తొలగించిందన్నారు. కార్మికుల సంక్షేమం టీడీపీ హయాంలోనే జరిగిందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఈఎస్ఐ ఆసుపత్రుల్లో కేంద్ర ప్రభుత్వం వేతనాలు ఇచ్చే పోస్టులను కూడా భర్తీ చేయలేదన్నారు.జిల్లావ్యాప్తంగా టీడీపీ,జనసేన, బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సచివాలయానికి తరలివెళ్లారు.మంత్రి సుభాష్‌కు జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మునిసిపల్ మాజీ వైస్ చైర్మ న్ కట్టా నాగేశ్వరరావు, కౌన్సిలరు అంకం శ్రీనివాస్, పట్టణ శాఖ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, టీడీపీ నాయకుడు మేడిశెట్టి శేషారావు, మాజీ ఎంపీ టీసీ విత్తనాల వెంకటరమణ, మాజీ కౌన్సిలరు దంగేటి గౌరీశంకర్, కడియాల రాఘవన్, నందూరి ఫణి కుమార్, పితాని వీరభద్రరరావు, పెంకె సాంబశివరావు, కంచుమర్తి బాబూరావు, నెం.1 బాబు శుభాకాంక్షలు తెలిపారు.



బొమ్మూరులోని కలెక్టరేట్ వెనుక ముస్తాబైన సైన్స్ మ్యూజియం

పవన్..పవర్

- బొమ్మూరు సైన్స్ మ్యూజియం త్వరలో ప్రారంభం
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో కదలిక

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎట్టకేలకు సైన్స్‌మ్యూజియం ప్రారంభం కానుంది.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సైన్స్ అండ్ టెక్నాలజీ,పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారుల్లో కదలిక వచ్చింది. గత పుష్కరాల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ చొరవతో రాజమహేంద్రవరానికి సైన్స్ మ్యూజియం మంజూరైంది. రూ.16.82 కోట్లు కేటాయించారు. మొదట స్థల సేకరణ జాప్యమైంది. ఆ తరువాత బొమ్మూరులోని మహిళా ప్రాంగణం పక్కన ప్రధాన రహదారిని ఆనుకుని ఐదెకరాల స్థలంలో కేంద్రం, రాష్ట్రం సమాన భాగస్వామ్యంతో దీనిని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీసీవోఎస్‌టీ) ఆధ్వర్యంలో కలకత్తాలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం(ఎన్‌సీఎస్ఎం) ఆధ్వర్యంలో ఇది జరిగింది. 2017లో మంజూరు కాగా 2018 ఫిబ్రవరి 18న శంకుస్థాపన చేశారు. 2019 జనవరిలో పనులు ఆరంభమయ్యాయి. బెంగళూరు కంపెనీ పనులు చేసింది. విద్యార్థులకు సైన్స్ పరంగా బాగా ఉపయోగపడే విధంగా విజ్ఞాన కేంద్రాన్ని తీర్చిదిద్దారు. భవనం, పార్కులు తీర్చిదిద్దారు. కానీ సైట్ ఫిల్లింగ్ చేయకుండా రోడ్డుకంటే పల్లం ప్రాంతంలో దీనిని నిర్మించడం విమర్శలకు దారి తీసింది. టీడీపీ హయాంలో మురళీమోహన్ కచ్చితంగా మెరక చేయాలని చెప్పారు. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో,అధికారంలోకి వచ్చిన వైసీపీ కనీసం దీనిని పట్టించుకోలేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడింది.నిర్మాణం పూర్తయినా ప్రారంభించకుండా వదిలేశారు.తిరిగి పవన్ చొరవతో త్వరలోనే ఇది ప్రారంభం కానుంది.

మీ అందరివాడిగానే ఉంటా : దుర్గేష్

నిడదవోలు నియోజకర్గ ప్రజల ఆశీర్వాదంతోనే మొదటిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నా.ఈ ఏడాది మార్చి 12వ తేదీన నిడదవోలులో అడుగు పెట్టా. వైసీపీ నేతలంతా నా స్థానికతపై సందేహాలను ప్రజల్లోకి తీసుకెళ్లినా ప్రజలంతా నన్ను పూర్తిగా విశ్వసించి నాకు అండగా నిలబడ్డారు.

రెట్టింపు ఉత్సాహంతో ప్రజా సేవ : వాసు

అసెంబ్లీకి తొలిసారి ప్రవేశించడం చాలా ఆనందంగా ఉంది. చట్ట సభలో చోట చోటు లభించడం చాలా సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే పదవిని బాధ్యతగా భావిస్తా. రాజమండ్రి సిటీ అభివృద్ధిలో నాముద్ర కనిపించేలా కృషి చేస్తాను. తమ అధినేతలు చంద్రబాబు, లోకేష్ రుణం తీర్చుకోలేనిది.

రాజానగరం ప్రజలు అవకాశం ఇచ్చారు : బత్తుల

జనసేన అధినేత పవన్ కల్యాణ్ నన్ను ఆశీర్వదించి, పంపితే ప్రజలూ ఆశీర్వదించి ఎమ్మెల్యేను చేశారు. నేను మంచి సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చా.రాజానగరం ప్రజలు కల్పించిన ఈ అవకాశంతో నా వంతు సమాజ సేవ చేస్తా. చట్టసభ అసెంబ్లీలోకి ప్రవేశించడం చాలా ఆనందంగా ఉంది.

గోపాలపురాన్ని అభివృద్ధి చేస్తా : మద్దిపాటి

అసెంబ్లీలోకి తొలిసారి ఎమ్మెల్యేగా అడుగుపెట్టడం సంతోషంగా ఉంది. ప్రజా సేవ చేయాలనే మంచి సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చా. రాజకీయంగా గాడ్ ఫాదర్ లేకపోయినా చంద్రబాబు, లోకేశ్ నాకీ అవకాశం కల్పించారు. గోపాలపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాను.

నాడు.. ఈ గౌరవం ఏమైందమ్మా!

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 20 : ప్రభుత్వ అధికారులంటే పబ్లిక్ సర్వెంట్స్.. అది ఏ అధికారి అయినా ఇంతే.. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వాళ్లు మాత్రం ప్రజల పక్షాన ఉండాలి.. అయితే గత ప్రభుత్వంలో మాత్రం అధికారులు అలా లేరు.. వైసీపీ పాలకులను మాత్రమే గౌరవించేవారు.. మిగిలిన ఏ పార్టీలకు చెందిన పాలకులు వచ్చినా కనీసం ప్రొటోకాల్ పాటించేవారు కాదు. ప్రజా సమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చినా గంటల తరబడి నిలబడాల్సిందే.. సుమారు 6 నెలల కిందట అప్పటి ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలపై వినతిపత్రం ఇచ్చేందుకు స్పందన కార్యక్రమానికి వచ్చిన మాజీ ఎమ్మెల్యేపై విరుచుకుపడ్డ జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వం మారేసరికి సాదరంగా ఆహ్వానించారు. ప్రస్తుత అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గత ప్రభుత్వ హయాంలో ప్రజాసమస్యలపై ఎన్నోసార్లు కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే ఏ రోజు ప్రొటోకాల్ పాటించలేదు. అలాంటిది ఎమ్మెల్యే హోదాలో గురువారం జిల్లా కలెక్టరేట్‌కు విచ్చేసిన ఆయనకు కలెక్టర్ స్వాగతం పలుకుతూ కూర్చోబెట్టి గౌరవంగా మాట్లాడారు. ఆయన చెప్పిన సమస్యలను సావధానంగా విన్నారు.. సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు.. ఇక అధికార పక్షమైనా.. స్వపక్షమైనా ఒకేలా స్పందించాలని ఆయన వెంట వచ్చిన నాయకులు అనడం గమనార్హం.



నాడు స్పందనలో నిలబెట్టి మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత

నేడు ఎమ్మెల్యే కావడంతో గౌరవంగా కూర్చోబెట్టి మాట్లాడుతున్న కలెక్టర్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం!

కొవ్వూరు, జూన్ 20 : అతివేగం ప్రమాదకరం.. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి ప్రాణా లు కోల్పోతున్నా వాహనదారుల తీరులో మాత్రం మార్పు రావడంలేదు.. వేగంగా వెళ్లి ప్రమాదాలకు కారకులవుతున్నారు.గతంలో స్పీడ్ గన్ల వ్యవస్థ ఉండేది.. పరిమితికి మించి వెళ్లే వాహనాలపై అప రాధ రుసుం విధించేవారు.. దీంతో చాలా మంది పరిమిత వేగంతోనే వెళ్లేవారు. అయితే ప్రస్తుతం ఆ స్పీడ్ గన్ల వ్యవస్థ మూలకు చేరడంతో వాహనదారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఎక్కడికక్కడ వన్ వే అమలులో ఉన్నా అతివేగం కారణంగా డివైడర్లు దాటుకుని వచ్చి మరీ ప్రమాదాలకు కారకులవుతున్నారు.గురువారం కొవ్వూరులో జరిగిన ప్రమాదమే అందుకు ఉదాహరణ. పెనుప్రమాదం త్రుటిలో తప్పినట్టే. గురువారం దొమ్మేరు వైపు నుంచి ఒక ఎర్టిగా కారు అతివేగంగా వస్తుంది.. కొవ్వూరు ఏబీఎన్ కళాశాల సమీపానికి వచ్చేసరికి ఎడమ వైపు నుంచి అడుగున్నర ఎత్తు ఉన్న డివైడర్‌పై నుంచి కుడి వైపునకు దూసుకొచ్చింది.అటుగా ఏదైనా కారు లేదా ద్విచక్రవాహనం వెళ్లి ఉంటే పెనుప్రమాదమే జరిగేది. ఆ సమయంలో రాజమహేంద్రవరం నుంచి 17 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు ఏలూరు వెళుతోంది. ఆ బస్‌ను ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదమేమీ జరగకుండా ఆగింది.ఈ ఘటనతో బస్ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో బస్సు ముందు సీటులో కూర్చున యర్నగూడెంకు చెందిన సిహెచ్.శిరీష తల బస్సు అద్దానికి తగలడంతో తీవ్ర గాయమైంది. 108 అంబులెన్స్‌లో గాయపడిన శిరీషను కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆర్టీసీ బస్సు ముందుభాగంతో పాటు, కారు దెబ్బతిన్నాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసునమోదు చేయవలసి ఉంది. ఆ కారులో యువకులు ఉన్నట్టు సమాచారం.



డివైడర్ దాటుకుని వచ్చి బస్సును ఢీకొన్న కారు

మంత్రి దుర్గేష్‌కు బూరుగుపల్లి అభినందన



మంత్రి దుర్గేష్‌ను అభినందిస్తున్న బూరుగుపల్లి, టీడీపీ నాయకులు

ఉండ్రాజవరం, జూన్ 20: రాష్ట్ర పర్యాటక శాఖమంత్రిగా కందుల దుర్గేష్ గురువారం రాష్ట్ర సచివాలయంలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, నాయకులు బూరుగుపల్లి అచ్చుతరామయ్య, రాచమళ్ల శ్రీనివాసరావు తదితరులు వెళ్లి మంత్రి దుర్గేష్‌కు అభినందనలు తెలిపి, సత్కరించారు.

దాళ్వా ధాన్యం బకాయిలు చెల్లించాలి

కొవ్వూరు, జూన్ 20: దాళ్వా ధాన్యం విక్రయించిన రైతులకు బకాయిలు చెల్లించాలని రైతు కేవీకే రంగారావు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏప్రిల్ 26వ తేదీ నుంచి రైతుభరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వానికి ధాన్యం విక్రయించిన రైతులకు ధాన్యం సొమ్ము జమ చేయకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. రైతులకు చెల్లించాల్సిన ధాన్యం బకాయిల సొమ్మును జగన్ ప్రభుత్వం వారికి కావలిసిన గుత్తేదారులు, ఇతర పథకాలకు మళ్లించి అన్నదాతలకు అన్యాయం చేసిందన్నారు. దీంతో సార్వా పెట్టుబడులకు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో సొమ్ము రైతు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పిన అధికారులు 56 రోజులు దాటినా సొమ్ము జమచేయలేదన్నారు.

గజ్జరంలో కూటమి విజయోత్సవ సభ



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, అల్లూరి, ద్విసభ్య కమిటీ

తాళ్లపూడి, జూన్ 20: మండలంలోని గజ్జరంలో కూటమి విజయోత్సవ సభ నిర్వహించారు. టీడీపీ నాయకులు కొర్లపాటి లక్ష్మణరావు(దత్తుడు), మద్దుకూరి పెద్దబ్బులు ఆధ్వర్యంలో దత్తుడు నివాసం వద్ద జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి కూటమి నాయకులతో కలిసి కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలుపారు. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజలందరికీ మేలు జరుతుందన్నారు. ఈ సందర్భంగా అల్లూరి విక్రమాదిత్య, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నామన పరమేశ్వరరావు, కొఠారు వెంకట్రావు, సూరపనేని చిన్ని, మద్దిపట్ల శివరామకృష్ణలను దత్తుడు సత్కరించారు. కార్యక్రమంలో కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, భరత్, గన్నిన సత్తిబాబు, దండమూడి శేషు, చలపాటి ప్రకాష్, కౌగాల శ్రీనివాస్, పెదపాటి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యుత్ ఉదయం వేళల్లోనే ఇవ్వాలి

సబ్‌స్టేషన్ ఎదుట నిరసన రైతుల నిరసన



చాగల్లులో విద్యుత్ శాఖాధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చాగల్లు, జూన్ 20: వ్యవసాయ విద్యుత్ బోర్లకు సరఫరా చేసే విద్యుత్‌ను ఉదయం 5గంటల నుంచి ఏకధాటిగా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్‌ను ఉదయం సరఫరా చేస్తే సార్వా పంటలకు దమ్ము చేయడానికి వీలుగా ఉంటుందన్నారు.

వరికి మద్దతు ధర మరింత పెంచాలి.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన వ్యవసాయ మద్దతు ధరల విషయంలో.. వరికి మద్దతు ధరను రూ.117 పెంచడం సరిపోదని క్వింటాల్‌కు రూ.2800 మద్దతు ధర ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం రైతులకు ఇస్తానని ప్రకటించిన రైతు భరోసాను రూ.20 వంతును ఒకే మొత్తంలో రైతులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో చాగల్లు, నెలటూరు రైతులు, రైతు సంఘం నాయకులు జీవీ సుబ్బారావు, కంకటాల బుద్దుడు, టి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మా నేను బడికి పోతా...



పోతవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈవో సత్యనారాయణ

నల్లజర్ల, జూన్ 20: బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యా శాఖ ద్వారా నేను బడికి పోతా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఎంఈవో సత్యనారాయణ అన్నారు. పోతవరం హైస్కూల్లో గురువారం అమ్మా నేను బడికి పోతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13నుంచి నెల రోజుల పాటు సాగే ఈ స్పెషల్ డ్రైవ్‌లో సచివాలయ ఉద్యోగులతో పాటు విద్యా కమిటీ, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడిఈడు పిల్లన్ని గుర్తిసారన్నారు. వారితోనే అమ్మా నేను బడికి పోతా అని చెప్పిస్తారన్నారు. పిల్లలు చదువుకుంటే కలిగే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్గిస్తారన్నారు. ఇంటింటి సందర్శనలో 30 గృహాలను సందర్శించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈవో-2 భగవతి, ప్రధానోపాధ్యాయుడు గోపిగోవర్దన్, సీఆర్పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవ కవాతుకు తరలిరండి

నల్లజర్ల, జూన్ 20: మంద కృష్ణ మాదిగ జూలై 7న వరంగల్‌లో నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతుకు తరలి రావాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు ఎం.ఏసుదాసు పిలుపునిచ్చారు.గురువారం ఘంటా వారి గూడెంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.

నారా భువనేశ్వరి జన్మదినం

ఉండ్రాజవరం, జూన్ 20: తాడిపర్రులో టీడీపీ ఆధ్వర్యంలో నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. ఆమె ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు పుస్తకావిష్కరణ

దివాన్‌చెరువు, జూన్ 20: తూర్పుగోదావరి జిల్లా రాజకీయాలు1952-2022 పుస్తకాన్ని నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1952లో ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి 2022 వరకూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద జిల్లాగా తూర్పుగోదావరి జిల్లా పేరు పొందిందన్నారు. ఈ జిల్లా రాజకీయాలను నన్నయ విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర విభాగం విశ్రాంత ఆచార్యులు బీవీవీ బాలకృష్ణ రచన సంకలనం చేశారని తెలిపారు. వర్శిటీలోని కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలను ఉపయోగించుకుంటూ ఈ పుస్తక రూపకల్పనకు కృషి చేశారని అభినందించారు. ప్రతులు కావలసిన వారు నన్నయ అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. గత చరిత్రను, ఒకనాటి సంఘటనలను విస్మరించకుండా రాబోయే సమాజానికి అక్షరబద్ధం చేసి ఇవ్వగలిగితే చరిత్రలోని లోటుపాట్లు నేటి సమాజానికి మార్గదర్శకం అవుతాయని వీసీ అన్నారు.

కాలినడక భద్రాచలం రామ సన్నిధికి

నల్లజర్ల, జూన్ 20: సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యేగా మద్దిపాటి వెంకట్రాజు విజయం సాధిస్తే కాలినడకన భద్రాచలం రాముని సన్నిధికి కాలినడకన వస్తానని చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకటరమణ దంపతులు మొక్కుకున్నారు. గురువారం మొక్కు చెల్లించేందుకు తిమ్మన్నపాలెం నుంచి బయలుదేరారు. టీడీపీ నాయకుడు అల్లాడ రాజారావు జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. తిమ్మన్నపాలెం, నల్లజర్ల నుంచి 80మంది టీడీపీ శ్రేణులు రావూరి వెంట కాలి నడకన వెళ్లారు.

తాగునీటి సరఫరాలో రాజీ పడబోం

- ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయాలి
- కొవ్వూరు ఆసుపత్రి వైద్యులు రిఫర్ చేయడం మానుకోవాలి
- ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష



జేసీబీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 20: తాగునీరు అందడం లేదని ఫిర్యాదులు రావడానికి వీలులేదని, తాగునీటి సరఫరాలో రాజీ పడే సమస్య లేదని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు నిర్వహణ సక్రమంగా అమలు చేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ మేనేజర్ మున్సిపాల్టీ ఉద్యోగులను పరిచయం చేశారు. శాఖల వారీగా పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఛైర్‌పర్సన్ మున్సిపాల్టీ అవుట్‌పాల్ డ్రైన్లు, రోడ్లు తదితర పనులకు రూ.45 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేసి ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా ఇళ్ల స్థలాలు అందించిన కాలనీలకు ప్రతిరోజు తాగునీరు సరఫరా చేయాలన్నారు. పట్టణంలోని అచ్చాయమ్మ కాలనీ, ఇందిరమ్మ కాలని, యానాది కాలనీ, వాంబే కాలనీల్లో తాగునీటి సమస్య ఉందని ప్రజలు వాపోతున్నారన్నారు. అధికారులు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలన్నారు. పబ్లిక్‌హెల్త్ డీఈ సత్యనారాయణ మాట్లాడుతూ ఏఐఐబీ (ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు) పథకంలో కొవ్వూరులో గోదావరి జలాలను శుద్ధిచేసి ప్రజలకు అందించడానికి రూ.58 కోట్లతో 2 ప్యాకేజీల కింద నిధులు మంజూరయ్యాయన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లుల మంజూరు కాకపోవడంతో పనులు మధ్యలో నిలిపివేశారన్నారు. 78 కిలోమీటర్లు పైపులైను వేయవలసి ఉండగా 10 కిలోమీటర్లు వేశారని, రూ.8 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పట్టణంలో కొత్తగా ఇచ్చిన 4 లేఅవుట్‌లలో వాటర్‌ట్యాంకులు, పైపులైను నిర్మాణాలకు అమృత్ 2.0 పథకంలో రూ.7.5 కోట్లు నిధులు మంజూరయ్యాయని, టెండర్లు పిలవగా, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో ఎస్టిమేట్లు వేసి టెండర్లు పిలుస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలోనే ఈ పథకం మంజూరైందని, వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కొత్తగా ఇచ్చిన లేఅవుట్‌లలో వాటర్‌ట్యాంకుల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలన్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, ప్రతి చిన్న దానికి రిఫర్ చేయడం మానుకోవాలన్నారు. ఆర్టీసీ సేవలను పూర్తి స్థాయిలో అందజేయాలన్నారు. జగనన్న కాలనీలకు వెళ్లే రహదారుల నిర్మాణం చేపట్టి, వీధి దీపాలు వెలిగించాలన్నారు. ఇదిలా ఉం డగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక మొదటిసారిగా మున్సిపల్ కార్యాలయానికి విచ్చేసిన ముప్పిడి వెంకటేశ్వరరావుకు కమిషనర్ కె.డానియేలు జోసఫ్ ఆధ్వ ర్యంలో ఛైర్‌పర్సన్ రత్నకుమారి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు పాటు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావులను మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు. రూ.35.50 లక్షలతో కొనుగోలు చేసిన జేసీబీని ఎమ్మెల్యే ముప్పిడి ప్రారంభించారు.

పంట కాలువల్లో పూడికలు తీయించాలి

మండలంలోని నందమూరు, పశివేదల గ్రామాల్లో ఏటా వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చే నీరు దిగువకు పారక వందలాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురై నష్టపోతున్నామని రైతులు ఎమ్మెల్యే ముప్పిడి వద్ద వాపోయారు. దశాబ్ద కాలంగా మండలంలోని పంట కాలువలు పూడికలు తీయలేదని, తక్షణమే తీయించాలని దుద్దుపూడి భద్రరావు వినతిపత్రం అందజేశారు. నందమూరు, పశివేదల గ్రామాల్లో కాలువలను ఆనుకుని ఉన్న పంట పొలాలను, కాలువలను కొందరు ఆక్రమించి అడ్డుకట్టలు వేయడంతో నీరు దిగువకు పారడం లేదన్నారు. ఆక్రమణలు, కాలువలకు అడ్డంగా వేసిన తూరలు తొలగించి, అవసరమైన చోట్ల కల్వర్టులు నిర్మాణం చేపట్టాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ కాలువల్లో పూడికలు, గుర్రపుడెక్క తొలగింపు, కల్వర్టుల నిర్మాణానికి ఎస్టిమేట్లు తయారుచేసి ఇవ్వాలని ఇరిగేషన్ ఏఈని కోరినట్టు భద్రరావు చెప్పారు. కార్యక్రమాల్లో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, పొట్రు మురళీ, దాయన రామకృష్ణ, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, మురుకొండ సత్యవతి, పాలూరి నీలిమ, కీలాని వెంకటలక్ష్మి, కండెల్లి రామారావు, బొండాడ సత్యనారాయణ, బర్ల శ్రీనివాస్, మద్దుల సత్యనారాయణ, తహశీల్దార్ కె.మస్తాన్ పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- ఘనంగా రెవెన్యూ దినోత్సవం
- పలువురు అధికారులు, ఉద్యోగులకు సత్కారాలు



కొవ్వూరు సబ్ కలెక్టర్ శ్రీవాస్తవను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 20: సమస్యలపై ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలను గౌరవించి సేవా దృక్పథంతో పనిచేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రెవెన్యూ దినోత్సవాన్ని పలుచోట్ల గురువారం నిర్వహించారు. కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఎమ్మెల్యే ముప్పిడి కేక్ కట్‌చేశారు. సబ్ కలెక్టర్‌తోపాటు రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు డీవీ శేషగిరి, సత్యనారాయణలను సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఓపిగ్గా విని పరిష్కరించాలన్నారు. ఉద్యోగులకున్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, తహశీల్దార్ కె.మస్తాన్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుత పరిపాలనా పరంగా ఉన్న శాఖలన్నీ ఒకప్పుడు రెవెన్యూ శాఖలో మిళితమై ఉండేవని, భూమిశిస్తు ఆధారంగా ఏర్పడ్డ రెవెన్యూ శాఖలో విభజన జరిగి వేర్వేరు శాఖలుగా విధులు నిర్వహిస్తున్నాయన్నారు. భూమిపై హక్కులున్న ప్రతిఒక్కరూ రెవెన్యూ రికార్డులు పరిశీలించుకోవాలన్నారు. పుట్టుక నుంచి మరణం వరకూ అన్ని ధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ శాఖ నుంచే జారీ చేస్తున్నామన్నారు. ప్రతి శాఖలో చిన్న చిన్న పొరపాట్లు సహజమేనన్నారు. అనంతరం రెవెన్యూ శాఖలో పదవీ విరమణ చేసిన సదాశివరావును సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల, డీటీ భారతి, ఎస్ఏ సీరామరాజు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

నల్లజర్ల: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో తహశీల్దార్ పి.కృష్ణారావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలైన అండగల్, ఆర్ఎస్ఆర్, వన్ బీ, దైనందిక కార్యక్రమాలను వివరించారు. మీ సేవ ద్వారా ఎన్ని సర్టిఫికెట్స్, ఏయే అంశాల్లో అందజేశారో వివరించారు. అనంతరం పదవీ విరమణ చేసిన గ్రామ నౌకర్లు బిరుదుగడ్డ రాజారావు, విప్పర్తి సుబ్బారావులను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, టీడీపీ నాయకులు కూసంపూడి వెంకటేశ్వరరావు(బుజ్జి) యద్దనపూడి బ్రహ్మారాజు, ఈడే శ్రీను, చుక్క శ్రీను, డీటీ కిషోర్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెరవలి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు అతికాల శ్రీను, సలాది కృష్ణమూర్తి, పిప్పర రవి, నందిప చక్రవర్తి మాట్లాడారు. గ్రామాల్లో ముఖ్యమైన పనులన్నీ రెవెన్యూ సిబ్బంది ద్వారానే జరుగుతాయని, అందువల్ల రెవెన్యూ శాఖకు, ప్రజానీకానికి ఎక్కువ సంబంధాలు ఉంటాయన్నారు. వారికి ప్రజలు సహకరించి పరిపాలన సక్రమంగా కొనసాగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత రెవెన్యూ అధికారులు ఇరగవరపు ప్రభాకరరావు, ముప్పిడి సుబ్బరాజులను సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుధ, డిప్యూటీ తహశీల్దార్, ఆర్ఐ పాల్గొన్నారు.



తాళ్లపూడిలో మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనివాసరావు



నల్లజర్లలో గ్రామసేవకులను సత్కరిస్తున్న దృశ్యం



పెరవలిలో రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రతి పంచాయతీకి శాస్త్రవేత్తలు చేరువకే

రీచ్ యువర్ పంచాయతీ

- ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ వెంకటనరసింహారావు



రైతులకు వ్యవసాయ సంబంధిత పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

దివాన్‌చెరువు/పెరవలి, జూన్ 20: ప్రతి పంచాయతీకి శాస్త్రవేత్తలు చేరువ కావాలన్న లక్ష్యంతోనే వ్యవసాయ విశ్వవిద్యాలయం రీచ్ యువర్ పంచాయతీ కార్యక్రమం నిర్వహిస్తోందని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. ఇందులో భాగంగా పెరవలి మండలం కానూరులో రైతు సదస్సు నిర్వహించినట్టు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. ఈ సదస్సులో ప్రస్తుత సార్వాకు సంబంధించిన నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి, ఎరువుల వాడకం గురించి వివరించామన్నారు. ఒక కిలో విత్తనానికి కార్బండిజమ్ 25శాతం + మాంకోజెబ్ 50శాతం మిశ్రమ శిలీంద్రనాశని 2గ్రాముల చొప్పున లీటరు నీటిలో కలిపి విత్తనశుద్ధిలో వాడాలన్నారు. నారుమడికి.. 10-12 రోజుల వ్యవధిలో 3దఫాలు దమ్ముచేసి చదును చేయాలన్నారు. 5సెంట్లు నారుమడికి 2 కిలోల నత్రజని, ఒక కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. జింకు లోపం గమనిస్తే 2 గ్రాముల జింకుసల్ఫేటు ఒకలీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ గుళికలు సెంటుకు 160 గ్రాముల చొప్పున వేయాలని, అలాగే నారు తీయడానికి వారం ముందుకుడా సెంటుకు 160 గ్రాములు చొప్పున వేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సిబ్బందికి ఎలుకల నివారణ, చీడ పురుగుల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తనతో బాటు ఏరువాక శాస్త్రవేత్తలు పి.అమ్మాజీ, ఎస్.హైమావతి, సర్పంచ్ బి.మధుపూర్ణచందు, ముళ్ళపూడి రాజేంద్ర ప్రసాద్, వ్యవసాయాధికారి ఎ.మేరీకిరణ్ తదితరులు పాల్గొన్నారన్నారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

ఎస్ఈబీ సీఐ శ్రీనివాసరావు



దేవరపల్లి సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ స్వామి

కొవ్వూరు, జూన్ 20: డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఎస్ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం కొవ్వూరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మాదవ ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల మానసిక, శారీరక అనారోగ్యాల పాలవుతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.సతీష్, డాక్టర్ డి.సత్యకుమారి, పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆర్.విజయలక్ష్మి, బి.ఉదయభవాని, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లి భాష్యం స్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్ఈబీ సీఐ కేవీ స్వామి మాట్లాడారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటికి డ్రగ్స్‌కు బానిసలైతే దుష్ఫలితాలు వస్తాయని వివరించారు. పరిస్థితుల ఒత్తిడి వల్ల సరదా కోసం డ్రగ్స్ తీసుకోవడం మొదలు పెడితే తీవ్ర మైన శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతారన్నారు. డ్రగ్స్ తీసుకోవడం అలవాటైతే కుటుంబ సభ్యులపై దాడులు, దొంగతనాలు చేయడం వంటి నేర ప్రవృత్తికి పాల్పడుతారన్నారు. మత్తుపదార్థాల వాడకం మనిషిని సామాజిక, నైతిక పతనావస్థకు చేరుస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధీర్, ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు, ఛాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ సభాన పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పూర్ణయోగా ఆధ్యాత్మిక కేంద్రం గురూజీ రామచంద్ర..నేడు ప్రపంచ యోగా డే



దేవరపల్లి, జూన్ 20: యోగా సాధనతో మానసిక ప్రశాంతత, శరీర దారుఢ్యం కలుగుతుందని పూర్ణయోగ ఆధ్యాత్మిక యోగా ప్రచార సంస్థ రామచంద్ర గురూజీ అన్నారు. ఆయన 2016 నుంచి దేవరపల్లిలో పూర్ణయోగ ఆశ్రమంలో ఉచిత యోగా శిక్షణ నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక రుగ్మతల నుంచి బయటపడడం, మానసిక, శారీరక ప్రశాంతతకు యోగా దోహదపడుతుంది. రామచంద్ర గురూజీ మాట్లాడుతూ 2000సంవత్సరంలో యోగా గురువు భిక్షమయ్య గురూజీ వద్ద ప్రాథమికంగా యోగ శిక్షణ అందుకున్నానని, ఆపై విజయనగరం జిల్లా జొన్నాడ నిర్మలానందగిరి స్వామి, బీహార్ స్కూల్ ఆఫ్ యోగా, ముంగేర్‌లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నానని తెలిపారు. శిక్షకుడిగా 2009 నుంచి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో అనేక మందికి యోగా శిక్షణ అందించానన్నారు. దేవరపల్లిలో 2016లో పూర్ణయోగా ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పాటు చేసి, తన నివాసాన్ని యోగాశ్రమంగా చేసుకుని ఉచితంగా శిక్షణనిస్తున్నానన్నారు. మనస్సు శరీరాల కలయికనే యోగం అంటారని, యోగ శాస్త్రాన్ని మానవాళికి అందించిన మహానుభావుడు పతాంజలి అని, ఆయన యోగ శాస్త్రాన్ని 8 భాగాలుగా అందించారన్నారు. అవి యమ, నియమ, ఆసన, ప్రాణాయామం, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి. ఇవి క్రమం తప్పకుండా సాధన చేస్తే జీవితానికి అర్థం పరమార్థం ఏర్పడుతుందన్నారు. ఆరోగ్యంగా, ఆనందంగా జీవించడానికి యోగా దోహదపడుతుందన్నారు. దేవరపల్లిలో యోగాశ్రమంలో యోగసాధకులు రోజూ తెల్లవారుజామున 5.30నుంచి 7గంటల వరకు సాధన నిర్వహిస్తారన్నారు.



ఆశ్రమంలో యోగాసనాలు వేస్తున్న శిక్షణార్థులు

అధిక మొత్తం ఆశజూపి

డాలర్లతో ఉడాయించిన ముఠా

- ఆరుగురి అరెస్ట్.. ఐదుగురి కోసం గాలింపు
- పోలీసుల తీరుపై అనుమానాలు



వివరాలు తెలుపుతున్నా అడిషనల్ ఎస్పీ సర్కార్

రాజమహేంద్రవరం, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): అమెరికా వెళ్లి డాలర్లు సంపాదించి తెచ్చుకున్నారు. కానీ అత్యాశతో ఓ ముఠా చేతిలో బురిడీ కొట్టారు. కేసు వివరాలను అడిషనల్ ఎస్పీ(క్రైమ్స్) టి.సర్కార్ గురువారం వెల్లడించారు. విశాఖపట్నంకి చెందిన వెలగల శివశంకర రెడ్డి 50 వేల అమెరికన్ డాలర్లను భారత కరెన్సీలోకి మారకం చేసుకునే క్రమంలో విశాఖకు చెందిన కర్రి కనకరాజుతో పరిచయం ఏర్పడింది. తమకు డాలర్లు ఇస్తే భారత కరెన్సీలో డాలరుకు రూ.98 ఇస్తామని ఆశచూపారు. దీంతో బేరం కుదిరింది. మే నెల 30న దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామంలోని జడ్పీ హైస్కూల్ వద్దకు శంకరరెడ్డి డాలర్లు తీసుకొని వెళ్లారు. అక్కడికి కనకరాజుతో పాటు మరో పది మంది వచ్చి డాలర్లు ఉన్న బ్యాగ్‌ని లాక్కుపోయారని అడిషనల్ ఎస్పీ తెలిపారు. ఈ కేసులో విశాఖకు చెందిన కనకరాజు, విజయనగరానికి చెందిన గణగల్ల అజయ్‌కుమార్, అల్లూరి జిల్లా సీలేరుకు చెందిన వంతల విష్ణు, పల్నాడు జిల్లా మల్లాది గ్రామానికి చెందిన సొంగా రమేశ్, విజయవాడకు చెందిన ఉడత రవితో సహా ఆరుగురిని గురువారం అరెస్టు చేసి 36 వేల డాలర్లు, ఇన్నోవా కారు, హోండా అమేజ్ కారు, 8 సెల్ ఫోన్లు రికవరీ చేయడం జరిగిందన్నారు. మరో ఐదుగురి కోసం గాలింపు చేపట్టామని తెలిపారు. అయితే పోలీసుల వివరణపై పలు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇండియన్ కరెన్సీలో సుమారు రూ.41 లక్షలకు సంబంధించిన భారీ నేరం విషయంలో ఏదో దాస్తున్నారనే అనుమానాలున్నాయి. నిందితులుగా పేర్కొన్న వారిలో అందరూ వివిధ జిల్లాలకు చెందినవాళ్లు. ఉదాహరణకు ఎక్కడో పల్నాడు జిల్లా ఒకరిదైతే ఇక్కడి అల్లూరి జిల్లా మరొకరిది. దీంతో వీళ్లందరూ ముఠాగా ఎలా ఏర్పడ్డారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలాగే శంకర్ రెడ్డికి అంత పెద్ద మొత్తంలో 50 వేల అమెరికన్ డాలర్లు ఎలా వచ్చాయనే స్పష్టత కూడా కొరవడింది. శంకర్ రెడ్డిది విశాఖ జిల్లా, నిందితులవి వివిధ ప్రాంతాలు. దేవరపల్లిలో దాడి ఎలా జరిగిందో వివరణ లేదు. దీంతో ఈ కేసు విషయంలో నిజాలు బయటకు రావాల్సిన అవసరం కనిపిస్తోంది.

కూటమి నాయకుల సంబరాలు

బిక్కవోలు, జూన్ 20: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటిసరఫరా, పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీరించిన సందర్భంగా బుధవారం రాత్రి పందలపాకలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జనసేన మండలాధ్యక్షుడు ఇందల వీరబాబు కేకు కట్ చేశారు. అనంతరం భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో పడాల చినబుజ్జి, గుణ్ణం శ్రీనివాసచౌదరి, సబ్బెళ్ల విజయభాస్కరరెడ్డి, సూరిబాబు, శ్రీనివాస్, ప్రసాద్, మణికంఠ, గంగరాజు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ వ్యాధి ప్రాణాంతకం

అవగాహన కార్యక్రమంలో డాక్టర్ శివశంకర్

కడియం, జూన్ 20: సికిల్‌సెల్ వ్యాధి ప్రాణాంతకమైనదని, నిరక్ష్యం చేస్తే ప్రాణాలనే బలిగొంటుందని కడియం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర్ తెలిపారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో గురువారం సికిల్‌సెల్ వ్యాధిపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. మనిషి శరీరంలో కొడవలిలా వంకర తిరిగి ఉన్న ఎర్ర రక్తకణాలనే సికిల్‌సెల్ అంటారన్నారు. 20 నుంచి 25 రోజుల జీవిత కాలం ఉండే ఈ ఎర్ర రక్తకణాలు కొడవలి మాదిరిగా ఉండటడంతో రక్తాన్ని అవయవాలకు చేరవేయడంలో ఇబ్బందులు సృష్టిస్తాయని, అప్పుడు ఎర్రరక్తకణాల సంఖ్య తగ్గి మనిషి వ్యాధి బారిన పడతారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బి.అప్పలకొండ, వైద్య సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	మనమే
వై.స్ర్కీన్2	మహారాజ
దేవిశ్రీ(గాయత్రి)	హరోంహర
అనన్య	తమ్ముడు

నిడదవోలు

వీ మ్యాక్స్	మనమే
రాధాకృష్ణ	మహారాజా
శ్రీగణపతి	హరోంహర

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	గంగం గణేశా
స్ర్కీన్ 2	---
శ్రీనివాస	---